


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 175 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 18 మార్చి 2026 | పేజీలు : 12 | వెల : 2/-

ఏపీకి అదనంగా..

# 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ



## పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ పెంచేలా కార్యాచరణ
## రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 15 రోజులకు సరిపడా ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నాయని.. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 14 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ స్టాక్ ఉంటే.. అదనంగా మరో 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ విశాఖలో అందుబాటులోకి వచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు, సరఫరా, సిలెండర్ల పంపిణీ, పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ సహా వివిధ అంశాలపై సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఏపీలో ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులూ లేవని సీఎం స్పష్టం చేశారు. ఈకేవైసీ, ఓటీపీల సాయంతో గ్యాస్ సిలెండర్లను బ్లాక్ మార్కెట్ కు తరలిపోకుండా చూడాలని ప్రజలకు ఇబ్బందులు లేకుండా పంపిణీ జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్యాస్ కంపెనీలు స్వల్ప కాలికంగా ఉత్పత్తి పెంచటంతో పాటు పంపిణీ కూడా మెరుగ్గా ఉండేలా చూడాలన్నారు. ప్రత్యేకించి గ్యాస్ సిలెండర్ల డెలివరీ సమయాన్ని 1.5 రోజులకు కుదించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆస్పత్రులు, హాస్టళ్లు, దేవాలయాలకు ఎలాంటి కొరతా లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రజలకు తక్షణం మిగతా .. 2లో..

కూటమి ప్రభుత్వంపై

# జగన్ తీవ్ర విమర్శలు

## డ్రగ్స్ వ్యవహారంలో ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం
## మహిళల భద్రతపై చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణ
## త్వరలో పాదయాత్ర చేపడతానని ప్రకటించిన జగన్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ వ్యవహారం, మహిళల భద్రత వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. పార్లమెంట్ చరిత్రలోనే డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ మొదటి ఎంపీ టీడీపీకి చెందిన పుట్టా మహేశ్ అని విమర్శిస్తూ, ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే రాష్ట్రంలో డ్రగ్స్ దందా పెరుగుతోందని జగన్ వ్యాఖ్యానించారు. బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు పట్టుబడిన సందర్భంలో కూడా ప్రభుత్వం మౌనంగా ఉండిపోయిందని విమర్శించారు. డ్రగ్స్ సమస్యపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మహిళల భద్రత విషయంలో కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలేదని జగన్ ఆరోపించారు. మహిళలపై దాడులు, వేధింపుల ఘటనలు పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం కేవలం కమిటీలు ఏర్పాటు చేయడానికే పరిమితమైందని విమర్శించారు. మహిళలపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు మిగతా .. 2లో..

జగన్‌కు ధైర్యముంటే

అభిశంసన తీర్మానానికి

# మద్దతివ్వాలి



**విజయనగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా అధ్యక్షుడు జగన్‌కు ధైర్యముంటే సీఈసీ జ్ఞానేశ్వర్‌పై పెట్టే అభిశంసనకు మద్దతివ్వాలని ఏపీసీసీ చీఫ్ షర్మిల సవాల్ విసిరారు. విజయనగరం జిల్లా జామిలో పర్యటించిన ఆమె.. వైకాపా ఎంపీలు ఇండియా బ్లాక్ ఎంపీలతో కలిసి సంతకాలు పెట్టాలని, అభిశంసనకు మద్దతిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. "రాష్ట్రంలో ఈవీఎంలు మిగతా .. 2లో..

మధ్యాహ్న భోజనంపై

# నిర్లక్ష్యం సహించము

## మైలవరం పాఠశాలలో మంత్రి నారా లోకేష్ ఆకస్మిక తనిఖీ
## విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యత పరిశీలన - తప్పు పునరావృతమైతే కఠిన చర్యల హెచ్చరిక



**మైలవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం ప్రాంతంలోని ఒక పాఠశాలలో ఇటీవల మధ్యాహ్న భోజనంపై వివాదం మిగతా .. 2లో..

చార్‌ధామ్ యాత్ర..

# ఆలయాల్లో యూట్యూబర్లపై ఆంక్షలు



**దేహ్రాదూన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మరికొన్ని రోజుల్లో మొదలుకానున్న చార్ ధామ్ యాత్ర కోసం ఏర్పాట్లు తుది దశకు చేరాయి. ఈ క్రమంలో యాత్రికుల భద్రత, సౌకర్యాల కోసం చేసిన ప్రతిపాదనలను మిగతా .. 2లో..

ఉద్రిక్తతల వేళ..

# యూఏఈ అధ్యక్షుడికి మోదీ ఫోన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేస్తుండడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై చర్చించామన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. "పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులపై చర్చించాం. యూఏఈపై జరిగిన అన్ని రకాల దాడులను భారత్ మరోసారి ఖండిస్తోంది. దాడులతో ప్రాణనష్టంతోపాటు మౌలిక సదుపాయాలు మిగతా .. 2లో..

వాటికి కాలమే

# జవాబిస్తుంది..

టీవీకే నేత వ్యాఖ్యలపై రజనీకాంత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అగ్ర నటుడు రజనీకాంత్ రాజకీయ ప్రయత్నాలపై ఇటీవల టీవీకే నేత మాట్లాడిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ వివాదంపై తాజాగా రజనీకాంత్ స్పందించారు. అవన్నీ అసత్య ప్రచారాలేనంటూ కొట్టిపారేశారు. అన్నిటికీ కాలమే జవాబిస్తుందన్నారు. అసలేం జరిగిందంటే.. నటుడు విజయ్ మిగతా .. 2లో..

# ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఓ అండ్ ఎం పనులు

## మే 15 నాటికి నిర్వహణ మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని మంత్రి నిమ్మల ఆదేశం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వచ్చే ఖరీఫ్ ప్రారంభానికి ముందే అంటే మే 15వ తేదీ నాటికి ఓ అండ్ ఎం పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు. మంగళవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఓ అండ్ ఎం పనుల పై ఇరిగేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్ని వేల కోట్లు ఖర్చుపెట్టి ఇరిగేషన్ పనులు చేసినా, నిర్వహణ సరిగా లేకపోతే, అంటే ఓ అండ్ ఎం పనులు ఏటా చేయకపోతే బూడిదలో పోసిన పన్నీరు అవుతుందన్నారు. వందల,వేల కోట్లు పెట్టి ప్రాజెక్టులు నిర్మిస్తే, వైసిపి ప్రభుత్వం మెయింటెన్స్ కూడా లేకుండా గాలికొదిలేసిందని మంత్రి విమర్శించారు. గత ప్రభుత్వంలో కనీసం కాలువల్లో తట్ట మట్టి తీయక పోగా, షట్టర్లు,డోర్లు, గేట్లకు మిగతా .. 2లో..

# ఉద్యోగాల కల్పనే సింగిల్ ఎజెండాగా ఉండాలి : మంత్రి లోకేశ్



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం కావాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళగిరి సమీపంలోని చినకాకానిలో మయూరి టెక్ పార్క్ భవనంలో ఏర్పాటు చేసిన ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే పెద్ద ఎత్తున పెట్టుబడులు సాధించిందని లోకేశ్ అన్నారు. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని చెప్పారు. గూగుల్, ఆర్సెలార్ మిత్తల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయన్నారు. ఇప్పుడు వేగాన్ని మరింత పెంచాల్సిన అవసరముందని చెప్పారు. ఉద్యోగాల కల్పనే సింగిల్ ఎజెండాగా ఉండాలని మంత్రి సూచించారు. నూతన పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్టుల మిగతా .. 2లో..

ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ లారిజానీని

# మట్టుబెట్టాం : ఇజ్రాయెల్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ లారిజానీని మట్టుబెట్టినట్లు ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ప్రకటించారు. లారిజానీని లక్ష్యంగా చేసుకుని టెహ్రాన్‌లో వైమానిక దాడులు జరిపినట్లు అంతకుముందు ఇజ్రాయెల్ సైనిక అధికారులు తెలిపారు. ఇతర దాడుల్లో

వివేకా హత్య కేసు.. నిజాలు దాచేందుకు

# వైకాపా యత్నం

## మంత్రి అనగాని సత్య ప్రసాద్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి వివేకా హత్య కేసులో నిజాలు దాచేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆరోపించారు. చెల్లెలు సునీత బాధపై స్పందించకుండా నిందితుడితో ప్రెస్‌మీట్ పెట్టిస్తారా?అని ప్రశ్నించారు. బాబాయ్‌ను చంపిన వారిని కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " ఐదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు వాస్తవాలను జగన్ మిగతా .. 2లో..

# 'మాకు ఎవరి అవసరం లేదు'

## మిత్ర దేశాల షాక్ వేళ ట్రంప్ వ్యాఖ్యలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌తో యుద్ధం వేళ.. బలప్రయోగం ద్వారా హర్మూజ్ జలసంధిని తెరిపించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందిస్తూ.. తమకు ఎవరి అవసరం లేదన్నారు. హర్మూజ్‌లో నౌకల రవాణాను పునరుద్ధరించేందుకు తాము ఒంటరిగానే ప్రయత్నిస్తామని చెప్పారు. "మాకు ఎవరి అవసరం లేదు. మాది ప్రపంచంలోనే అత్యంత బలమైన దేశం. అత్యంత శక్తిమంతమైన సైన్యం మాకుంది" అని అధ్యక్షుడు వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిపై మిత్ర దేశాలు కలిసి రాకపోవడంపై అసహనం మిగతా .. 2లో..

డి.ముప్పవరంలో మంత్రి కందుల

# ఆకస్మిక తనిఖీ

## పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల పరిశీలన
## విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనంపై ఆరా..
## కూటమి ప్రభుత్వ విద్యా సంస్కరణలను వివరించిన మంత్రి దుర్గేష్



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ మంగళవారం డి.ముప్పవరంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మరియు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వంపై

# జగన్ తీవ్ర విమర్శలు

పెరుగుతున్నాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఖరే కారణమని జగన్ ఆరోపించారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడం వల్లే దురాగతాలు పెరుగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో కొన్ని నాయకులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను కూడా ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయ్యాయని జగన్ పేర్కొన్నారు. ఇక మిగిలింది కేవలం రెండేళ్లే అని, చివరి ఏడాది ఎన్నికలు జరుగుతాయని అన్నారు. ఈ మధ్యలో తాను పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. 'జగన్ 2.ఓ'లో పార్టీ కార్యకర్తలకు మరింత ప్రాధాన్యత ఇస్తామని, వారి ద్వారానే ప్రజలకు మరింత చేరువ అవుతామని ఆయన స్పష్టం చేశారు.

మధ్యాహ్న భోజనంపై

# నిర్లక్ష్యం సహించము

తలెత్తిన నేపథ్యంలో మంత్రి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మైలవరం దేవునిచెరువు తారకరామా నగర్ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన మంత్రి లోకేశ్, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం గురించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కొత్త కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనం ఎలా ఉందని ప్రశ్నించగా విద్యార్థులు భోజనం బాగుందని తెలిపారు. వివాదం జరిగిన రోజు భోజనం పరిస్థితి ఎలా ఉందని కూడా మంత్రి ఆరా తీశారు. భోజనంలో ఏవైనా సమస్యలు ఉంటే ముందుగా తల్లిదండ్రులకు తెలియజేయాలని మంత్రి విద్యార్థులకు సూచించారు. ఇకపై మధ్యాహ్న భోజనం నాణ్యతపై తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. లీప్ యాప్ ద్వారా తల్లిదండ్రుల ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామని, మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భోజనం సిద్ధమైన తర్వాత ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యతను పరిశీలిస్తున్నారా అని మంత్రి పాఠశాల సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం అధికారులతో సమావేశమైన మంత్రి లోకేశ్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని గట్టిగా హెచ్చరించారు. విద్యార్థులకు సంబంధించిన చిన్న సమస్య అయినా వెంటనే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. తప్పు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రతి వారం ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని అధికారులకు ఆదేశించారు. పాఠశాలలోని రికార్డులు, విద్యాబోధన తీరును కూడా మంత్రి పరిశీలించారు. ప్రతి పాఠశాల తనకు సమానంగా ముఖ్యమని పేర్కొంటూ అడ్మిషన్ల పెంపుతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజనంలో సమూల మార్పులు తీసుకురావడానికి త్వరలోనే సెంట్రలైజ్డ్ కిచెన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే వారంలో ఒకరోజు స్థానిక ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఆయన సూచించారు.

చార్‌ధామ్ యాత్ర..

# ఆలయాల్లో యూట్యూబర్లపై ఆంక్షలు

బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (బీకేటీసీ) ఆమోదించింది. ఈ ఏడాది రూ.121 కోట్లతో బడ్జెట్‌ను రూపొందించారు. ఏప్రిల్ 19న అక్షయ తృతీయ రోజు గంగోత్రి, యమునోత్రి ఆలయ తలుపులు తెరచుకోవడంతో యాత్ర ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 22న కేదార్‌నాథ్, ఏప్రిల్ 23 నుంచి బద్రీనాథ్ ఆలయాల్లో భక్తులను అనుమతిస్తారు. ఆలయ గర్భగుడిలోకి మొబైల్ ఫోన్లను అనుమతించమని, ఇది తనకు కూడా వర్తిస్తుందని బీకేటీసీ అధ్యక్షుడు హేమంత్ ద్వివేది స్పష్టం చేశారు. యూట్యూబర్లు, బ్లాగర్లను ఆలయంలో కొన్ని ప్రాంతాలకు అనుమతించేది లేదన్నారు. తీర్థయాత్రలను, పర్యటకాన్ని కొందరు ఒకేలా చూస్తున్నారని, అవి రెండూ వేర్వేరని చెప్పారు. ప్రతి భక్తుడు మొబైల్ ఫోన్లు, కెమెరాలను భద్రపరిచేందుకు ఆలయం బయట ప్రత్యేకంగా లాకర్లు ఏర్పాటు చేశామన్నారు. మరోవైపు, చార్‌ధామ్‌కు వచ్చే భక్తుల సంఖ్య ఈసారి కూడా పెరుగుతోందని, రెండు వారాల్లోనే 6లక్షలకు పైగా పేర్లను నమోదు చేసుకున్నారని ఆలయ కమిటీ పేర్కొంది.

ఉద్రిక్తతల వేళ..

# యూఏఈ అధ్యక్షుడికి మోదీ ఫోన్

దెబ్బతిన్నాయి. హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకలు సురక్షితంగా, స్వేచ్ఛగా వెళ్లేలా చూడాల్సి ఉందని రెండు దేశాలు అభిప్రాయపడ్డాయి. ఈ ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని పునరుద్ధరించేందుకు ఇరువురం కలిసి పనిచేస్తాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూఏఈ అధ్యక్షుడికి ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఓ అండ్ ఎం పనులు

మరమ్మత్తులు చేయలేదన్నారు. కనీసం గ్రీజు కూడా పెట్టలేదని చెప్పారు. గత పాలకులు చేసిన తప్పిదాలే మన పాలిట శాపాలయ్యాయని అన్నారు. వీటన్నింటినీ సరిచేసుకుంటూ, ఇరిగేషన్ రంగాన్ని గాడిలో పెడుతున్నామని ఆయన వివరించారు. ఎంత దారుణం అంటే గత వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్లలో నిర్వహణ పనుల నిమిత్తం 200 కోట్లు కూడా ఖర్చు చేయకపోతే, కూటమి ప్రభుత్వం మొదటి రెండేళ్ళలోనే 878 కోట్లు మంజూరు చేసి ఖర్చు చేశామన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని 2026 ఖరీఫ్ ప్రారంభానికి ముందే నీటిపారుదల వ్యవస్థలను సాధారణ స్థితికి తీసుకురావాలన్నారు. అందుకుగాను ఓ అండ్ ఎం పనులు తక్షణమే చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అంతేకాక అత్యవసర పనులన్నీ అత్యంత నాణ్యతతో చేయాలని సూచించారు. రైతుల అవసరాల కోసం చెరువుల్లో పూడిక తీసిన మట్టిని, క్యూబిక్ మీటర్ 1 రూపాయి కే, రైతులకు సరఫరా చేసేలా అనుమతులు కూడా ఇచ్చామని ఆయన అన్నారు. ఈ సమావేశం లో కడా కమిషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల కల్పనే సింగిల్ ఎజెండాగా ఉండాలి : మంత్రి లోకేశ్

గ్రౌండింగ్ మన ప్రధాన లక్ష్యం కావాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంటీ కృష్ణబాబు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు, **SERP** మరియు **NRI** శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి మండలి నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ల మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు నిర్దేశించిన 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం చేరుకోవడంలో ఏపీఈడీబీ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ పెద్ద లక్ష్యం విజయవంతంగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందని ఆయన గుర్తు చేశారు. మంత్రి నారా లోకేష్ గారి డైనమిక్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ పెట్టుబడులకు అత్యుత్తమ చిరునామాగా మార్చే ప్రక్రియలో భాగస్వామ్యం కావడం గర్వకారణంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనకు అపారమైన అవకాశాలు ఉన్నాయి.. మనం ఇచ్చిన హామీ మేరకు రాబోయే ఐదేళ్లలో లక్ష్యాన్ని చేరుకోవడమే కాకుండా, ఆ తర్వాతి కాలంలో అంతకు మించిన విజయాలను నమోదు చేయాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధన కోసం జిల్లాల కలెక్టర్లతో పాటు అన్ని శాఖలను సమన్వయం చేసుకోవాలన్నారు. కింది స్థాయిలో మీవీజు గురించి అవగాహన కల్పించాలని... ఇందుకోసం కలెక్టర్లతో పాటు అన్ని శాఖల సహకారం తీసుకుని మీవీజుని పటిష్టం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెట్టుబడులకు కావాల్సిన సంపూర్ణ సహకారం అందిస్తోందని.. ఇది గుర్తించే ప్రపంచ వ్యాప్తంగా ఆంధ్రాలో పెట్టుబడులు పెట్టేందుకు ఎంతోమంది ఆసక్తి చూపిస్తున్నారని మంత్రి చెప్పారు. ఇది మనమందరం గర్వించాల్సిన విషయం అని మంత్రి శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయంలో కష్టపడుతోన్న సంబంధిత శాఖాధికారులను కూడా మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో టి. కృష్ణబాబు, యువరాజ్, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసు.. నిజాలు దాచేందుకు

# వైకాపా యత్నం

ఏమార్చారు. అధికారం పోయాక బలప్రదర్శన చేస్తున్నారే తప్ప ప్రజలపై ప్రేమ లేదు. జగన్ చెప్పే అబద్ధాలు నమ్మకుండా ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు" అని అనగాని అన్నారు. ఈ సందర్భంగా వివేకా హత్యపై జగన్, అవినాష్‌రెడ్డి వ్యాఖ్యల వీడియోలు ప్రదర్శించారు.

# 'మాకు ఎవరి అవసరం లేదు'

వ్యక్తంచేశారు. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

డి.ముప్పవరంలో మంత్రి కందుల

# ఆకస్మిక తనిఖీ

సందర్శనలో భాగంగా మంత్రి కందుల దుర్గేష్ తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో సరదాగా గడిపారు. స్వయంగా పాఠ్యపుస్తకాన్ని చేతబూని విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. "కందుల దుర్గేష్ అంటే ఎవరు? ఈ నియోజకవర్గానికి ఆయన ఏమవుతారు?" అని చమత్కరిస్తూ విద్యార్థుల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని నింపారు. తాను కూడా సామాన్యంగా చదువుకుని పైకి వచ్చిన వాడినేనని, ఎవరూ కంగారు పడకుండా బాగా చదువుకోవాలని హితబోధ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై మంత్రి దుర్గేష్ ప్రత్యేక దృష్టి సారించారు. వంట గదిని తనిఖీ చేసి, వంట ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా? రాగి జావ రుచిగా ఉందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన మెనూలో ఏవైనా పదార్థాలు తక్కువైతే ధైర్యంగా అడిగి తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం విద్యాశాఖకు ఇస్తున్న ప్రాధాన్యతను ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వివరించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యా వ్యవస్థలో వస్తున్న విప్లవాత్మక సంస్కరణలను ప్రస్తావించారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సాయంపై విద్యార్థుల తల్లిదండ్రులతో ఆరా తీశారు. విద్యార్థి మిత్ర కిట్ ను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై వివరాలు ఆరా తీసిన మంత్రి దుర్గేష్ తక్షణమే సొంత భవనంలోకి మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఐసీడీఎస్ పీడీని ఫోన్ ద్వారా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల నూతన భవన నిర్మాణాలను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల బోధనా తీరుపై విద్యార్థుల నుంచి సానుకూల స్పందన రావడంతో వారిని మంత్రి దుర్గేష్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యాశాఖ అధికారులు మరియు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# అభిశంసన తీర్మానానికి మద్దతివ్వాలి

మారిపోయాయని దొంగ ఏడుపులు ఏడ్చారు కదా. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇండియా కూటమి పెట్టే తీర్మానికి మద్దతు ప్రకటించాలి. మోదీకి దత్తపుత్రుడు కాదని నిరూపించుకోవాలి. ఎన్నికల సంఘాన్ని ప్రధాని మోదీ తన చేతుల్లో పెట్టుకున్నారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ విరుద్ధంగా పని చేస్తోంది" అని షర్మిల ఆరోపించారు.

# జవాబిస్తుంది..

నేతృత్వంలోని టీవీకే పార్టీ జనరల్ సెక్రటరీ ఆదవ్ అర్జున ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. రజనీకాంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన రాజకీయాల్లో ప్రవేశించేందుకు ప్రయత్నించిన సమయంలో డీఎంకే పార్టీ రజనీపై బెదిరింపులకు పాల్పడిందని ఆరోపించారు. ఈ విషయంలో తాను నటుడిపై విమర్శలు చేయాలనుకోవట్లేదని, ఇలాంటి ఒత్తిళ్లకు తమ నేత విజయ్ తలొగ్గరని చెప్పడమే తన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను డీఎంకే పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. రాజకీయ లబ్ధి కోసమే టీవీకే ఇలాంటి ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టారు. అటు రజనీకాంత్ అభిమానులు కూడా తీవ్రంగా మండిపడ్డారు. మరికొద్ది రోజుల్లో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ క్రమంలోనే తాజాగా రజనీకాంత్ ఎక్స్ వేదికగా స్పందించారు. "టీవీకేలో ఉన్నతస్థాయిలో ఉన్న నేత నాపై చేసిన వ్యాఖ్యలు అసత్యం. ఆయన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నాకు మద్దతుగా నిలిచిన రాజకీయ, సినీ ప్రముఖులు, మీడియా మిత్రులు, అభిమానులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఈ విషయంలో నేను చెప్పేది ఒక్కటే.. కాలం మాట్లాడకపోవచ్చు కానీ, సరైన సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానమిస్తుంది" అని తన పోస్ట్‌లో స్పష్టం చేశారు. 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు రజనీ రాజకీయ ప్రవేశంపై పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. 'రజనీ మక్కళ్ మండ్రం' పేరుతో రాజకీయ పార్టీ పెట్టనున్నట్లు వార్తలు కూడా వచ్చాయి. వీటికి 2020లో ఆయన ఫుల్‌స్టాప్ పెట్టారు. అనారోగ్య కారణాల వల్ల తాను రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనను విరమించుకుంటున్నట్లు అప్పట్లో ఆయన ప్రకటించారు. ఇదిలా ఉండగా.. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలను ప్రకటించనున్నారు.

# మట్టుబెట్టాం : ఇజ్రాయెల్

ఐఆర్‌జీసీకి చెందిన బసిజ్ పారామిలిటరీ ఫోర్స్ కమాండర్ గోలమ్‌రెజా సోలేమాని హతమైనట్టు వెల్లడించారు. ఈ ఘటనలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. ఇటీవల మృతి చెందిన ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీకి లారిజానీ కుడిభుజంగా వ్యవహరించారు. దేశ భద్రత, ఇరాన్ అణు కార్యక్రమం తదితర వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారు. 'సుప్రీం కౌన్సిల్ ఆఫ్ ది కల్చరల్ రివల్యూషన్'లోనూ సభ్యుడిగా ఉన్నారు. అలీ ఖమేనీ మరణానంతరం లారిజానీని ఇరాన్‌లో శక్తిమంతమైన నేతగా పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. మరోవైపు.. గోలమ్‌రెజా సోలేమాని నేతృత్వంలోని బసిజ్ దళాలు ఇరాన్‌లో ప్రజా నిరసనలను ఉక్కుపాదంతో అణచివేశాయని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఆయనపై అమెరికా, ఈయూ ఆంక్షలు విధించాయి. బసిజ్ డిప్యూటీ కమాండర్, ఇతర ఉన్నతాధికారులను కూడా అంతమొందించినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. పాలస్తీనా ఇస్లామిక్ నేత అక్రమ్ అల్– అజౌరీ తదితరులపైనా దాడులు చేసినట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో అల్– అజౌరీ మరణించి ఉండొచ్చని పేర్కొంది. గాజా, వెస్ట్ బ్యాంక్ కేంద్రాలుగా ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొంటున్న వీరు టెహ్రాన్‌లోని ఒక సురక్షిత స్థావరంలో దాక్కుని ఉండగా దాడి చేసినట్లు తెలిపింది.

# 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ

అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్ ల స్టాక్స్ లభ్యతను కూడా తెలుసుకోవాలని సూచించారు.

### పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ విస్తృతికి చర్యలు

ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పైప్డ్ గ్యాస్ కనెక్షన్లు, నెట్వర్క్ పెంపు పైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ మరింతగా విస్తరించే అంశంపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏపీలో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్, పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగాన్ని గరిష్టంగా పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గతంలో ఎల్ఎన్ జీని ఏపీకి కేటాయించేలా చేసుకుని 2 సీజన్లలో పైప్ ద్వారా కొండపల్లి వరకూ తీసుకు రాగలిగామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఎనర్జీ ట్రాన్సిషన్ జరిగేలా వ్యయం తక్కువ అయ్యే ఇంధనాన్ని వినియోగదారులకు అందించాల్సి ఉందని స్పష్టం చేశారు. పైప్డ్ గ్యాస్ సరఫరాకు సంబంధించి తక్షణం చేయగలమన్న అంశంపై యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచించారు. ప్రస్తుతం సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ ద్వారా ఏజీ అండ్ పీ, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్, జీజీపీఎల్, ఐఓసీఎల్, మెఘా గ్యాస్ లు సహజ వాయువును సరఫరా చేస్తున్నాయని అధికారులు వివరించారు. 198 సీఎన్జీ స్టేషన్ల ద్వారా ఈ సరఫరా జరుగుతోందని తెలిపారు. 1.68 లక్షల డొమెస్టిక్ కనెక్షన్లు ఇచ్చేలా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలియచేశారు. దీనిపై స్పందించిన సీఎం సీఎన్జీ, పీఎన్జీ నెట్వర్క్ ను మరింత విస్తృతం చేయాలని దిశానిర్దేశం చేశారు. అమరావతితో పాటు పట్టణ ప్రాంతాల్లో పైప్డ్ గ్యాస్ నెట్వర్క్ పెంచుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక సదుపాయాల ను పెంచేందుకు వీలుగా పెట్రోలియం కంపెనీలు కూడా సహకరించేలా కేంద్రంతో సంప్రదింపులు చేయాలన్నారు.

### త్వరలో ఏపీ వన్ యాప్ ద్వారా సేవలు

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వాహనదారులను సెన్సిటైజ్ చేయాలని సీఎం సూచించారు. సిటిజన్ సేఫ్టీ అవేర్‌నెస్ కింద వారికి సంక్షిప్త సమాచారాన్ని పంపించాలని అన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు లింక్ ను యాప్ ద్వారా లేదా వాట్సప్ గవర్నెన్సు ద్వారా వినియోగదారులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి రూపొందిస్తున్న ఏపీ వన్ యాప్ ను త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. డేటా లేక్, అవేర్ ను ప్రభుత్వ శాఖలు ఏమేరకు వినియోగించుకున్నది గుర్తించాలని సీఎం సూచించారు. వేసవిలో అవేర్ ద్వారా సమాచారం తీసుకుని తాగునీరు, హీట్ వేవ్స్, పశుగ్రాసం సహా వివిధ అంశాలపై ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మహిళలపై నేరాలు, డ్రగ్స్ నియంత్రణ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించేలా ప్రజల్లో విస్తృతమైన మార్పు వచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. గ్రామాల్లో వ్యర్థాలను తొలగించి చెత్తను వర్గీకరించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. భవన నిర్మాణాల నుంచి వచ్చే వ్యర్థాలను సర్క్యులర్ ఎకానమీకి వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, ఐఅండ్ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పంచాయితీరాజ్, పురపాలక శాఖల ముఖ్య కార్యదర్శులు శశిభూషణ్ కుమార్, సురేశ్ కుమార్, దేవాదాయశాఖ కార్యదర్శి హరి జవహర్ లాల్, వివిధ పెట్రోలియం కంపెనీలు, గెయిల్, ఓఎన్జీసీ ప్రతినిధులు హాజరయ్యారు.

# ఎడిటర్ వాయిస్

## నాగబాబు మనసు ఆ ఎంపీ సీటు పైన?

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు మక్కువ పడి మనసు పెంచుకున్న సీటు ఒకటి ఉందని అంటున్నారు. అదే ఉత్తరాంధ్ర జిల్లాలలోని అనకాపల్లి ఎంపీ సీటు అని చెబుతున్నారు. నిజానికి అన్నీ కలసి వస్తే నాగబాబు ఇక్కడ నుంచి 2024 ఎన్నికల్లో జనసేన నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేసి ఎంపీ కావడం ఖాయంగా జరిగి ఉండేది. కానీ చివరి నిమిషంలో పొత్తు సీట్ల సర్దుబాటులో వచ్చిన ఇబ్బందుల కారణంగా బీజేపీకి ఈ సీటు జనసేన త్యాగం చేయాల్సి వచ్చింది అని చెబుతారు. అలా బీజేపీకి చెందిన సీఎం రమేష్ అనకాపల్లి ఎంపీ అయిపోయారు. ఇక చూస్తే నాగబాబుకు 2024 చివరిలో రాజ్యసభకు ఏర్పడిన ఖాళీలలో కూడా సీటు దక్కలేదు. 2025 మార్చిలో ఆయన ఎమ్మెల్సీ కాగలిగారు. కానీ నాగబాబు మనసు మాత్రం పార్లమెంట్ మీదనే ఉంది అని అంటున్నారు.

ఉత్తరాంధ్రా ఫోకస్ : జనసేన కీలక నాయకుడిగా నాగబాబు ఉత్తరాంధ్రా జిల్లాలలో తరచూ పర్యటిస్తున్నారు. ఇక్కడ ఉన్న మూడు ఉమ్మడి జిల్లాలలో ఆయన జనసేన కార్యక్రమాలను పరిశీలిస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా నాగబాబు శ్రీకాకుళం విశాఖ జిల్లాలలో పర్యటించి క్యాడర్ కి ఉత్తేజం కలిగించారు. అలాగే సభ్యత్వ నమోదు ప్రక్రియను కూడా ఆయన పరిశీలిస్తూ కృషి చేస్తున్న క్యాడర్ ని ప్రోత్సహించారు. ఎమ్మెల్సీ కాక ముందు అయిన తరువాత కూడా నాగబాబు ఉత్తరాంధ్రా మీదనే ప్రత్యేక ఫోకస్ పెడుతున్నారు. దానికి కారణం జనసేనకు ఉభయ గోదావరి జిల్లాల తరువాత ఉత్తరాంధ్రలోనే బలం అధికంగా ఉంది అని అంటున్నారు.

పోటీ చేయలేకపోయా : తాజా పర్యటనలో శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించిన పార్టీ క్యాడర్ తో జరిగిన సమావేశంలో నాగబాబు మాట్లాడుతూ తాను అనకాపల్లి ఎంపీ సీటు నుంచి అనివార్య కారణాల వల్ల పోటీ చేయలేకపోయాను అని చెప్పడం విశేషం. కూటమి పొత్తు ధర్మం వల్లనే అనకాపల్లి పార్లమెంట్ సీటుని జనసేన వదులుకోవాల్సి వచ్చింది అని నాగబాబు చెప్పడం గమనార్హం. జనసేన తానుగా ఈ సీటు వదులుకోవాల్సి వచ్చిందని కూడా గుర్తు చేశారు. అంతటితో ఆగని నాగబాబు అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో జనసేనకు మంచి బలం ఉందని దానిని పార్టీ క్యాడర్ అంతా కలసి మరింతగా బలోపేతం చేయాలని కోరడం విశేషం.

ఫ్యూచర్ ప్లాన్ ఏంటి : నాగబాబు తాజాగా చేసిన ఈ వ్యాఖ్యల మీద అయితే పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. గతంలో కూడా జిల్లాల పర్యటనలో ఆయన అనకాపల్లిని వదులుకున్నామని మంచి బలం ఉందని చెబుతూ వచ్చారు ఇపుడు మరో మారు ఆయన చెప్పడమే కాదు అక్కడ పార్టీని ఇంకా బలోపేతం చేయాలని కోరడంతో ఫ్యూచర్ ప్లాన్స్ ఏమైనా ఆయనకు ఉన్నాయా అన్న చర్చ సాగుతోంది. 2029 ఎన్నికల్లో నాగబాబు పార్లమెంట్ కి అనకాపల్లిని ఎంచుకుని మరీ పోటీ చేస్తారా అన్న ఊహాగానాలు కూడా ప్రచారంలో ఉన్నాయి. అనకాపల్లి పరిధిలో బలమైన సామాజిక వర్గం ఉంది. పైగా అక్కడ వైసీపీ ఈ రోజుకీ కొంత వీక్ గా ఉంది. ఇంకా కోలుకోలేదు అని అంటున్నారు. దాంతో జనసేన ఈ ప్రాంతంలో గట్టిగా నిలిచి బలపడేందుకు యాక్షన్ ప్లాన్ ని రూపొందిస్తోంది అని అంటున్నారు.

ఎంపీ కావాలన్నదే : ఇక చూస్తే కనుక 2019లో జనసేన తరపున నాగబాబు నరసాపురం నుంచి లోక్ సభకు పోటీ చేసి రెండున్నర లక్షలకు పైగా ఓట్లను సాధించారు నిజంగా ఒంటరి పోరులో భారీ ఎత్తున ఓట్లను రాబట్టడం అంటే సాధారణ విషయం కాదు, అయితే ఆనాడు వైసీపీ వేవ్ లో ఓటమి చూడాల్సి వచ్చింది అన్ అంటున్నారు. 2024లో అయితే అనకాపల్లి సీటు మొదట జనసేనకే ఇచ్చారు. నాగబాబు ఎన్నికలకు చాలా ముందుగానే వచ్చి ఎన్నికల కసరత్తుని మొదలెట్టారు. తీరా దగ్గర చేసి జనసేన వెనక్కి తగ్గాల్సి వచ్చింది. దాంతో పాటు రాజ్యసభకు సైతం వెళ్ళేందుకు నాగబాబుకు అవకాశం దక్కలేదు, ఎమ్మెల్సీగానే ఆయన ప్రస్తుతం ఉన్నారు. అందువల్ల ఆయన మనసులో ఎంపీ కావాలని బలంగా ఉంది అని ప్రచారం సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ఐసీయూలో అగ్నిప్రమాదం

**10 మంది రోగుల దుర్మరణం**
**11 మందికి గాయాలు**
**ఒడిశాలోని కటక్ ఎస్సీబీ ఆసుపత్రిలో ఘోరం**



**భువనేశ్వర్, విశ్వం వాయిస్ న్యూస్ :** వారంతా వివిధ అనారోగ్యాలతో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.. ఆదివారం అర్ధరాత్రి దాటాక 2.30 గంటలప్పుడు రేగిన అగ్నికీలల్లో చిక్కుకున్నారు. ఈ ప్రమాదంలో 10 మంది రోగులు చనిపోయారు. ఒడిశా రాష్ట్రం కటక్‌లోని శ్రీరామచంద్ర భంజ్(ఎస్సీబీ) ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రి ట్రామా ఐసీయూలో ఈ ఘోరం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో ఐసీయూలో 23 మంది రోగులు ఉన్నారు. సిబ్బంది అప్రమత్తమై కొందరిని కాపాడి, వేరే వార్డులకు తరలించారు. ఈ క్రమంలో 11 మంది సిబ్బందికి కాలిన గాయాలయ్యాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్గి రాజుకుందని, ఐసీయూ నిండా దట్టంగా పొగ అలుముకుందని, నీటిని వెదజల్లే స్ప్రింక్లర్లు పని చేయలేదని ప్రాథమికంగా నిర్ధారించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నా... మంటలను వెంటనే నియంత్రించలేకపోయారు. ఇతర వార్డులకూ పొగ వ్యాపించడంతో రోగులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సోమవారం ఉదయం 6 గంటలకు మంటలు నియంత్రణలోకి వచ్చాయి.

**రూ.25 లక్షల చొప్పున పరిహారం**

ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్ మహలింగ, డీజీపీ యోగేష్‌బహదూర్ ఖురానియా, ఇతర అధికారులు ఆసుపత్రికి చేరుకుని, ఐసీయూను పరిశీలించారు. గాయపడిన వారిని పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు సీఎం ప్రకటించారు.

**రాష్ట్రపతి, ప్రధాని సంతాపం**

మృతుల కుటుంబాలకు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.50 వేల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. సీఎం మోహన్‌చరణ్ మాఝితో ఫోన్‌లో మాట్లాడి.. వివరాలను తెలుసుకున్నారు. గవర్నర్ కంభంపాటి హరిబాబు, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, విపక్షనేత నవీన్‌పట్నాయక్ సంతాపం వెలిబుచ్చారు.

## ఆ మృగాళ్లకు జీవితకాల జైలుశిక్ష

**తూర్పుగోదావరి జిల్లాలో 'సామూహిక అత్యాచారం' ఘటనలో కోర్టు తీర్పు**



**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకలో 2024 అక్టోబరులో మహిళ(43)పై సామూహిక అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన నలుగురు మృగాళ్లకు రాజమహేంద్రవరంలోని ఎనిమిదో అదనపు జిల్లా జ్యుడిషియల్ కోర్టు సోమవారం జీవితకాల జైలుశిక్ష విధించింది. కేసు వివరాలను జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ వెల్లడించారు. ఒడిశాలోని పర్లాఖెముండి ప్రాంతానికి చెందిన దంపతులు కడియం మండలానికి వచ్చి నర్సరీల్లో కూలి పనులు చేసుకునేవారు. వీరికి దివ్యాంగురాలైన కుమార్తె, డిగ్రీ చదివే కుమారుడు ఉన్నారు. 2024 అక్టోబరు 15న మహిళ తన పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా బుర్రిలంకకు చెందిన దేవర యేసు(26), వెలుబుడి ప్రవీణ్(21), లోకిన జయప్రసాద్(19), పొట్టిలంకకు చెందిన దాసరి సురేష్(22).. ఆమెను అటకాయించి బలవంతం చేశారు. బాధితురాలు ప్రతిఘటించడంతో సమీపంలోని పొదల్లోకి లాక్కెళ్లి తువ్వాలను నోట్లోకుక్కి ముక్కు మూసేయడంతో ఆమె స్పృహ కోల్పోయారు. నిందితులు మద్యం మత్తులో పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. అదే రోజు రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఆమెను పంట కాలువలో పడేశారు. బాధితురాలి భర్త పోలీసులను ఆశ్రయించడంతో అక్టోబరు 16న కడియం పోలీసు స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైంది. తరువాతి రోజు 17న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల లాకుల వద్ద సదరు మహిళ మృతదేహం లభ్యమైంది. 15 రోజుల్లోనే పోలీసులు నిందితులను పట్టుకున్నారు. నిందితుడు యేసు పథకం ప్రకారం తన స్నేహితులతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిర్ధారణైంది. రాజమహేంద్రవరంలోని ఎనిమిదో అదనపు జిల్లా జ్యుడిషియల్ కోర్టు న్యాయమూర్తి సోమవారం నిందితులకు జీవితకాల జైలుశిక్ష, ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా.. లేదా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

## తక్కువ ధరకే మొబైల్స్.. పార్సిల్ విప్పి చూస్తే స్పీకర్లు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. తక్కువ ధరకు సామ్‌సంగ్ మొబైల్స్ పేరుతో ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇచ్చి.. ఫోన్లకు బదులు స్పీకర్లు, టంబ్లర్లు పంపించినట్లు గుర్తించారు. ఐదేళ్లలో 3,880 మందిని మోసం చేసినట్లు పోలీసులు తేల్చారు. టెలీకాలర్ల ద్వారా ఫేక్ ఆఫర్లు ఇచ్చిన ముఠా సభ్యులు.. కస్టమర్ డేటా సేకరించి బెంగళూరు, హైదరాబాద్ కేంద్రంగా మోసాలకు పాల్పడుతున్నట్లు తేలింది. నలుగురు నిందితుల్ని అరెస్టు చేసి.. వారి నుంచి నుంచి రూ.1.40 లక్షల నగదు, పలు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ టాస్క్‌ఫోర్స్, రాజేంద్రనగర్ పోలీసులు ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు.

## బోసినవ్వులు మాయమయ్యాయి

**తండ్రి కారు వెనక్కి తీస్తుండగా టైరు కింద పడి 16 నెలల చిన్నారి మృతి**



**తానూరు (భైంసా), విశ్వం వాయిస్ న్యూస్ :** అప్పటివరకు కుటుంబసభ్యులు, బంధువులతో ఆ చిన్నారి చిరునవ్వులు చిందించింది. అంతలోనే అనుకోని రీతిలో జరిగిన ఘటనతో కానరాని లోకాలకు వెళ్లిపోయింది. తండ్రి కారు వెనక్కి తీస్తుండగా టైరు కిందపడి 16 నెలల చిన్నారి శ్రీయాంశి మృత్యువాత పడిన హృదయ విదారక ఘటన నిర్మల్ జిల్లా తానూరు మండలం బోరిగాంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై షేక్ జుబేర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోరిగాంకు చెందిన బాలేరావ్ అవదూత్, సుష్మ దంపతులు ఏడాది క్రితం నార్కట్‌పల్లికి వలస వెళ్లారు. బంధువుల పెళ్లి కోసం ఇద్దరు కుమార్తెలతో కలిసి సొంతూరు బోరిగాంకు కారులో వచ్చారు. ఇంటి ముందు నిలిపిన కారును చెట్టు నీడలో ఉంచుదామని సోమవారం మధ్యాహ్నం అవదూత్ కారు వద్దకు వెళ్లారు. అతడి వెనకే చిన్న కుమార్తె శ్రీయాంశి వెళ్లింది. పాప తన వెంటే వస్తున్నట్లు గమనించని తండ్రి.. కారును వెనక్కి తీశారు. ఇంట్లో నుంచి కుటుంబసభ్యులు చూస్తుండగానే ఆ పాప కారు టైరు కిందపడి తీవ్రగాయాల పాలైంది. భైంసా ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గం మధ్యలో మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**8 నెలల క్రితమే ప్రేమ వివాహం..**

## గర్భవతిగా ఉన్న భార్యను చంపిన భర్త



**కోరుట్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** జగిత్యాల జిల్లాలో దారుణం జరిగింది. నాలుగు నెలల గర్భవతిగా ఉన్న భార్యపై భర్త కత్తితో దాడి చేసి చంపాడు. కోరుట్ల మండలం మాదాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ప్రాథమికంగా తెలిపిన వివరాల ప్రకారం.. 8 నెలల క్రితం కోరుట్లకు చెందిన చిత్తరి హరిబాబు, మాదాపూర్‌కు చెందిన వైష్ణవి (19) ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి మాదాపూర్‌లోనే నివాసముంటున్నారు. హరిబాబు ప్రభుత్వ ఆస్పత్రిలో ఒప్పంద పద్ధతిలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వైష్ణవి రీల్స్ చేస్తూ యూట్యూబ్ ఛానల్ నడిపిస్తోంది. గత కొద్దిరోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం వేకువజామున 4 గంటలకు వైష్ణవిపై హరిబాబు కత్తితో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం కుటుంబసభ్యులు చూసేసరికి రక్తపుమడుగులో వైష్ణవి పడి ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కళ్లల్లో కారం చల్లి.. కోటి రూపాయల దోపిడీ

**మూసాపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కూకట్‌పల్లిలో భారీ దారి దోపిడీ జరిగింది. బహదూర్‌పురాకు చెందిన కుస్రు, అజీముద్దీన్ డబ్బుతో వెళ్తుండగా నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌లపై వచ్చి కళ్లలో కారం చల్లారు. అనంతరం రూ.కోటి నగదు తీసుకుని పారిపోయారు. పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన అర్ధరాత్రి జరిగింది. హవాలా డబ్బు కావొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

**పోలీసుల అదుపులో నలుగురు నిందితులు?**

ఈ కేసులో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సీసీ కెమెరాల ఆధారంగా గాలింపు చేపట్టి శంషాబాద్ వద్ద వారిని పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఎవరు డబ్బు అందజేశారు? ఎక్కడికి తరలించాలని ఆదేశించారు? తదితర అంశాలపై పోలీసులు విచారిస్తున్నారు.

# పోష్టికాహార భద్రత కోసం బయోఫోర్టిఫైడ్ రకాల పంటలు..




## రెండు నిర్దిష్ట కార్యక్రమాలను ప్రారంభించిన ఐసీఏఆర్



భారతదేశం వ్యవసాయాధారిత దేశం. అయితే రకరకాల అననుకూల పరిస్థితులు.. వ్యవసాయం నష్టాలనే మిగులుస్తుండడం... చీడపీడలు, తెగుళ్లు.. సకాలంలో వానలు కురవకపోవడం.. పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు ముంచెత్తడం.. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం... ఇలాంటి అననుకూల పరిస్థితులతో రైతులు వ్యవసాయం నుంచి తిరుగుముఖం పడుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అందుబాటులోకి తెస్తున్నాయి. అందులో భాగంగానే **nutritional security** కోసం కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా **biofortified varieties** పంటలను పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు **ICAR** రెండు నిర్దిష్ట కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి **Kailash Choudhary** మంగళవారం లోక్‌సభలో తెలిపారు.

**ఆ రెండు కార్యక్రమాలు ఏంటంటే..**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ రెండు కార్యక్రమాలను రూపొందించింది : న్యూట్రి-సెన్సిటివ్ అగ్రికల్చరల్ రిసోర్సెస్ అండ్ ఇన్నోవేషన్స్, వ్యవసాయంలో విలువ జోడింపు, సాంకేతికత ఇంక్యుబేషన్ సెంటర్లు (వాటికా). వ్యవసాయంలో మహిళలపై ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ కింద, **ICAR** "పోషకాహార భద్రత కోసం స్థిరమైన విధానాలు", "పోషక భద్రత వ్యవసాయ కుటుంబాల ఆరోగ్య ప్రమోషన్" వంటి కార్యక్రమాలను కూడా అమలు చేస్తోంది. లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో, వ్యవసాయాభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కార్యక్రమాలలో భాగంగా పాఠశాలలు, సంఘాలలో న్యూట్రి-గార్డెన్‌లను నిర్మించామని, అక్కడ పోషకాహార విద్యపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు.

**రకరకాల పంటలు..**

ఇంకా దీనిమీద మంత్రి సమాచారం ఇస్తూ.. **ICAR** వరి, గోధుమ, మొక్కజొన్న, మినుములు, కందులు, వేరుశెనగ, లిన్సీడ్, ఆవాలు, సోయాబీన్‌లలో 79 పోషకాలు అధికంగా ఉండే బయోఫోర్టిఫైడ్ రకాలను అభివృద్ధి చేసింది అని తెలిపారు. కాలీఫ్లవర్, బంగాళదుంప, చిలగడదుంప, గ్రేటర్ యామ్, దానిమ్మ, అదనంగా ఎనిమిది బయోఫోర్టిఫైడ్ ఉద్యాన పంటల రకాలు, వివిధ మాస్ కమ్యూనికేషన్ మాధ్యమాలను కలుపుకొని శిక్షణలు, ప్రదర్శనల ద్వారా రైతులలో ప్రాచుర్యం పొందుతున్నాయి. ఐరన్, జింక్, కాల్షియం, ప్రొటీన్, విటమిన్ సి, ప్రొవిటమిన్ ఎ, ఒలేయిక్ యాసిడ్ వంటి ముఖ్యమైన ఖనిజాలు ఈ సాగులో మెరుగయ్యాయని మంత్రి అభిప్రాయంగా చెప్పుకొచ్చారు..

**ICAR గురించి...**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అనేది భారతదేశంలో వ్యవసాయ విద్య, పరిశోధనలను సమన్వయం చేసే స్వయం-పాలన సంస్థ. ఇది వ్యవసాయ మంత్రిత్వ శాఖలోని వ్యవసాయ పరిశోధన, విద్యా శాఖకు నివేదిస్తుంది. దీని అధ్యక్షుడు కేంద్ర వ్యవసాయ మంత్రి. ఇది ప్రపంచంలోనే అత్యంత విస్తృతమైన వ్యవసాయ పరిశోధన, బోధనా సంస్థల నెట్‌వర్క్. **NARI** కార్యక్రమం పోషకాహార భద్రతను పెంపొందించడానికి వ్యవసాయాన్ని పోషకాహారం, న్యూట్రి-స్మార్ట్ గ్రామాలతో అనుసంధానం చేస్తూ కుటుంబ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంపై దృష్టి పెడుతుంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

బుధవారం, 18 మార్చి 2026

4

www.viswamvoice.com



వాద ప్రతివాదాల మధ్య

## మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం

**కరాచీ సెంటర్ పేరును జాతీయ నాయకుల విగ్రహాల సెంటర్‌గా పిలవాలని డిమాండ్ : కౌన్సిలర్ మందపల్లి రవి**

**ఎన్టీఆర్ సెంటర్‌గా ఉన్న పేరు రద్దు చేస్తారా - టిడిపి కౌన్సిలర్ల సవాల్ - నిబంధనలకు లోబడి వ్యవహరిస్తాం... చైర్ పర్సన్ రాణి**







**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం వాద ప్రతివాదాలు మధ్య సాగింది . మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి అధ్యక్షత కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం జరిగింది. ఎక్స్ అఫిషియో సభ్యులుగా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు హాజరయ్యారు.తోలుత కరాచీ సెంటర్ వద్ద ఉన్న విగ్రహాల వద్ద విగ్రహాల సెంటర్ పేరు తో బోర్డు ఏర్పాటు చేశారని దిన్ని తక్షణం తొలగించాలని టిడిపి కౌన్సిలర్ కాసిన కాశీ విశ్వనాథ్ డిమాండ్ చేశారు. దీనిపై వైసీపీ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. మండపేటలో అనుమతి లేని విగ్రహాలన్నిటిని తొలగించాలంటూ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం నడుచుకుంటామని స్పష్టం చేశారు. కరాచీ సెంటర్ కు గతంలోనే ఎన్టీఆర్ సెంటర్ గా నామకరణ చేశారని అక్కడ ఎన్టీఆర్ విగ్రహం కూడా ఉందని గుర్తు చేశారు. ఇప్పుడున్న విగ్రహాల సెంటర్ నామకరణ తమ కౌన్సిల్లో ఎక్కడ రాలేదని తాను అలా నామకరణ చేస్తూ ఎలాంటి తీర్మానం చేయలేదంటు అన్నారు. ఇటు టిడిపి కౌన్సిలర్లు చైర్ పర్సన్ సమాధానానికి చప్పట్లు కొడుతూ హర్షం వ్యక్తం చేశారు. కరాచీ సెంటర్ వద్ద మహనీయుల విగ్రహాల సెంటర్ అని బోర్డు పెట్టారని అది ఎన్టీఆర్ సెంటర్ అని టిడిపి కౌన్సిలర్ కాసిన కాశీ విశ్వనాథం పేర్కొన్నారు. ఎన్టీఆర్ ను అగౌరపరుస్తూ ఆయన పేరును తొలగించి బోర్డులు ఏర్పాటు చేస్తారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దశలో వైసిపి కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో గత వైసిపి హయాంలో ఆ సెంటర్ వద్ద జాతీయ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.దానికి విగ్రహాల సెంటర్ అని నామకరణ చేస్తే తప్పేమిటో చెప్పాలంటూ నిలదీశారు. ఈ తరుణంలో టిడిపి కౌన్సిలర్లు యరమాటి గంగరాజు కాసిన కాశీ విశ్వనాథం కాళ్లకూరి స్వరాజ్య భవాని వైసిపి కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్ పిల్లి శ్రీనివాసల మధ్య వాదోపవాదనలు జరిగాయి. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట నియోజవర్గ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ ఈ చర్చ ఎప్పటికీ ముగియదని పేర్కొన్నారు. అసలు సమస్య లేనప్పుడు ఇంకా పరిష్కారం ఎక్కడుంటుందని ప్రశ్నించారు. అక్కడ ఎన్టీఆర్ సెంటర్ గా నామకరణ చేసి ఉంటే దాన్ని మార్చేందుకు ఎలా అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ ఆ సెంటర్ కి ఎన్టీఆర్ పేరు ఉందన్నారు. దాన్ని తొలగించాలంటే కౌన్సిల్ కి ఆ అంశాన్ని తీసుకురావాలని ఆక్కడ కౌన్సిలర్ల బలాబలాలను బట్టి ఆమోదించాలా తిరస్కరించాలని నిర్ణయం అవుతుందన్నారు. అనంతరం ఒకవేళ ఎన్టీఆర్ సెంటర్ పేరు తొలగిస్తే జాతీయ నాయకుల విగ్రహాల పేర్లను పెట్టేందుకు మరో తీర్మానాన్ని తీసుకురావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మందపల్లి రవికుమార్ మాట్లాడుతూ గతంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆ సెంటర్ కు విగ్రహాల సెంటర్ గా నామకరణ చేశారని గుర్తు చేశారు. దీనిపై స్పందించిన చైర్ పర్సన్ నోటి మాటతో చెప్పడం చెల్లదని తాను ఏనాడు ఆ అంశాన్ని నమోదు చేయలేదని కౌన్సిల్లో కూడా ఈ విషయం రాలేదని స్పష్టం చేశారు. నోటిమాటతో చెప్పాలంటే తాను సీఎం అని అంటానని అయిపోతానా అంటూ ఎద్దేవా చేశారు. ఈ సమాధానానికి టిడిపి కౌన్సిలర్లు పెద్ద ఎత్తున చప్పట్లు కొడుతూ చైర్ పర్సన్ కు మద్దతుగా నిలిచారు. ఈ దశలో మందపల్లి రవికుమార్ మాట్లాడుతూ మండపేటలోని చాలా విగ్రహాలకు ప్రభుత్వ అనుమతులు లేవని వాటన్నిటిని తొలగించాలని డిమాండ్ చేశారు. విగ్రహాల సెంటర్ బోర్డు తీసేస్తే వీటి పై తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ దశలో వాదనలు జరిగిన తర్వాత మందపల్లి ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుల వివక్షత చూపిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ తరుణంలో టిడిపి కౌన్సిలర్లు వాదనకు దిగడంతో ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ రెచ్చగొట్టే ధోరణి గొడవలు పడే ప్రయత్నించడం తగదాన్ని తమ కౌన్సిల్ సభ్యులంతా మౌనంగా ఉండాలని సూచించారు. దీంతో టీడీపీ సభ్యులు నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఈ తరుణంలో కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ రాజబాబు మాట్లాడుతూ వాస్తవానికి ఆ సెంటర్ పేరు ఎన్టీఆర్ సెంటర్ గా ఉందని దాన్ని తొలగించాలంటే కౌన్సిల్ తీర్మానం తప్పనిసరి అని పేర్కొన్నారు. మండపేటలో అన్ని విగ్రహాలకు కౌన్సిల్ తీర్మానాలు ఉన్నాయన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు అయిన ఏకైక విగ్రహం బస్టాండ్ లోని తమ తాత బిక్కిన తాతబ్బాయి విగ్రహం ఒక్కటేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మందపల్లి రవికుమార్ మాట్లాడుతూ మండపేట పట్టణంలో కొన్ని ప్రాంతాలకు కొన్ని పాఠశాలలకు వేగుళ్ళ వీర్రాజు పేరు నామకరణ చేశారని ఆ స్కూళ్లకు దాతల వాటాగా సొమ్ము చెల్లించారా అంటూ నిలదీశారు. అప్పట్లో అలాంటి నిబంధనలు ఏమీ లేవని టిడిపి కౌన్సిలర్ గంగరాజు చెప్పారు. ఇలా ఇదే అంశం సాగుతుండడంతో ఎమ్మెల్యే వేగుళ్ళ కల్పించుకుని ఈ అంశంపై తీర్మానాలు అన్ని అధికారులు అందజేసేలా సమావేశాన్ని సాయంత్రానికి వాయిదా వేద్దామంటూ సలహా ఇచ్చారు. దీంతో స్పందించిన చైర్ పర్సన్ కౌన్సిల్లోని అజెండాలోని అంశాలన్నీ చర్చించి ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఈ వివాదానికి తెరపడింది. కాగా ఎన్టీఆర్ సెంటర్ లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద డొక్కా సీతమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి పేర్కొన్నారు.

దేవీపట్నం మండలంలో

## ఆగని అక్రమ కలప రవాణా

**నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు - అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకునేదెప్పుడు?**

**సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ డిమాండ్**



**రంపచోడవరం/దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని దేవీపట్నం మండలంలో అటవీ సంపద యథేచ్ఛగా కొల్లగొట్టబడుతోంది. గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ, ప్రకృతి ప్రసాదించిన విలువైన కలపను అక్రమార్కులు తరలిస్తుంటే అధికారులు కన్నెత్తి చూడకపోవడం దారుణమని సిపిఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ తీవ్రంగా ఖండించారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజన చట్టాలు, 1/70 చట్టం అమలులో ఉన్నప్పటికీ, వాటికి విరుద్ధంగా ఏజెన్సీ సంపదను అక్రమార్కులు దోచుకుంటున్నారనీ ఆమె అన్నారు.

**అధికారుల మౌనం:** రాత్రికి రాత్రి లారీలు, ట్రాక్టర్లతో, బొలెరో వ్యాన్లతో కలప తరలిపోతుంటే ఫారెస్ట్ చెక్ పోస్టులు ఏం చేస్తున్నట్లు? అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ దందా జరుగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయనీ ఆమె ఆరోపించారు.. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల పేరుతోనూ, ఇతర సాకులతోనూ అడవిని గుండు కొట్టడం వల్ల భవిష్యత్తులో పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందనీ ఆమె అన్నారు..

గిరిజనుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఉన్న యంత్రాంగం, అక్రమార్కులకు కొమ్ముకాయడం సిగ్గుచేటనీ,గిరిజన సంపద గిరిజనులకే చెందాలి తప్ప, దళారీల పాలు కాకూడదనీ ఆమె అన్నారు.

దేవీపట్నం మండలంలో జరుగుతున్న అక్రమ రవాణాపై జిల్లా కలెక్టర్,ఉన్నత అటవీ అధికారులు తక్షణమే స్పందించి క్షేత్ర స్థాయి విచారణ చేపట్టాలనీ ఆమె డిమాండ్ చేశారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన స్థానిక అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ,

అడవి లోపల నుండి కలప బయటకు వెళ్లే అన్ని మార్గాల్లో నిరంతర నిఘా సెంటర్లు ఏర్పాటు చేయాలనీ ఆమె డిమాండ్ చేశారు.

జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే, గిరిజన ప్రజలను ఏకం చేసి భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని, అవసరమైతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు ఆమె హేచ్చరిక చేశారు. అటవీ సంపద దోపిడీని ఉన్నతాదికారులు అరికట్టే వరకు దశలవారి పోరాటశీ చేస్తామని గా ఆమె తెలిపారు.

పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చే

## క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యం


**గిరిజన క్రీడాకారుల ప్రతిభా వేటకు విశేష స్పందన - విద్యార్థుల ప్రతిభ, క్రమశిక్షణ ఆకట్టుకున్నాయి**

**ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జగదీశ్వరి వెల్లడి**



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** గిరిజన క్రీడాకారుల ప్రతిభా వేట కార్యక్రమం రంపచోడవరం లో రెండో రోజు కూడా ఉత్సాహభరితంగా కొనసాగిందని,విశేష స్పందనను సొంతం చేసుకుందని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి తెలిపారు. రంపచోడవరం ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి గిరిజన ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరై తమ ప్రతిభను చాటుతూ ఆకట్టుకుంటున్నారు.మార్చ్ పాస్ట్‌లో విద్యార్థులు ప్రదర్శించిన క్రమశిక్షణ,ఉత్సాహం,సమన్వయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని ఆమె అభినందించారు.అథ్లెటిక్స్,వివిధ క్రీడా విభాగాల్లో యువ క్రీడాకారులు చూపుతున్న ప్రతిభ భవిష్యత్‌లో రాష్ట్రానికి మంచి పేరు తీసుకువచ్చే స్థాయిలో ఉందని పేర్కొన్నారు.మార్చి 16న ఘనంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ,గిరిజన ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడం,వారికి సరైన శిక్షణ, అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల క్రీడా అభివృద్ధి అధికారులు,అనుభవజ్ఞులైన కోచ్‌లు పాల్గొని క్రీడాకారుల ప్రతిభను సమగ్రంగా పరిశీలిస్తూ ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నారు.గిరిజన యువతకు ప్రోత్సాహం అందించేందుకు,రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు తీసుకెళ్లే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకంగా వ్యవహరిస్తూ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు.

## లైన్స్ విద్యాప్రోత్సహ ట్రస్ట్ చైర్మన్‌గా కొల్లూరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా లైన్స్ సెంటీనియల్ విద్యా ప్రోత్సహక ట్రస్ట్ చైర్మన్గా కొల్లూరి గోపాలకృష్ణ (విశ్రాంత సూపరిండెంట్ ఇంజనీర్ ఏపీ ఎస్ సి బి )ఎంపికయ్యారు ఈ మేరకు పూర్వపు చైర్మన్ లైన్స్ పూర్వపు గవర్నర్ బి.వి.యన్.రెడ్డి తెలిపారు. 2026-2028 సంవత్సరాలకు గాను నూతన కమిటీని ట్రస్ట్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎ. ఇందీవర శ్యాం కోశాధికారిగా డి.రామసుబ్రహ్మణ్యం( కాకినాడ )తోపాటు మొదటి వైస్ చైర్మన్‌గా ఎం.వి.రమణ రావు, (మండపేట)రెండవ చైర్మన్‌గా పి.ఎస్.కామేశ్వరిదేవి (అమలాపురం) సహాయ కార్యదర్శిగా వడ్డాది. నాగిని( కాకినాడ) జాయింట్ ట్రెజరర్ గా చిట్టూరి. వీర్రాజు (సామర్లకోటల)ను ఎన్నుకున్నారు. గత పది సంవత్సరాలుగా లైన్స్ సెంటినియల్ విద్యా ప్రోత్సహక ట్రస్టు ద్వారా అనేకమంది చదువుకు మెరిట్ స్కాలర్షిప్ అందించడం ద్వారా ప్రోత్సాహం అందిస్తుంది అని నిర్వాహకులు తెలిపారు నూతన కార్యవర్గానికి పూర్వపు గవర్నర్లు అభినందనలు తెలిపారు తనను చైర్మన్గా ఎంపిక చేసుకున్నందుకు కొల్లూరు గోపాలకృష్ణ ట్రస్టు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు త్వరలోనే నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని గోపాలకృష్ణ అన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి నియామక పత్రంపై

## చైర్ పర్సన్ రాణి చివరి సంతకం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపాలిటీ ప్రతిష్టాత్మక ఎన్నికల్లో గెలుపొంది చైర్మన్ పీఠాన్ని అధిరోహించి పట్టణాన్ని అభివృద్ధి పథంలో పెట్టిన చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి చైర్ పర్సన్ హోదా లో చివరి సంతకం మంగళవారం సాయంత్రం చేశారు. అది కూడా ఓ కుటుంబానికి ఉపాధి కల్పించే ఉత్తర్వులు పై సంతకాన్ని చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు.మున్సిపల్ చైర్ పర్సన్ గా ఆఖరి సంతకం ఉద్యోగ నియామక పత్రం పై పతివాడ నూక దుర్గారాణి చేశారు. మంగళవారం సాయంత్రం ఆమె ఛాంబర్ లో లంక సుదర్శన్ రాజు కు పారిశుద్ధ్య కార్మికుడి గా ఆమె నియామక పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కారుణ్య నియామకం లో భాగంగా లంక సుదర్శన్ రాజు కు ఉద్యోగం వచ్చినట్లు తెలిపారు.ఉద్యోగ నియామకం పై తన ఆఖరి సంతకం చేయడం సంతోషం కలిగించిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగి ప్రసన్న, చైర్ పర్సన్ పి ఏ రాజేష్ తదితరులు ఉన్నారు.

## మూగజీవాల దాహార్తి నీళ్ల కుండీలను ఏర్పాటు చేయండి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు పాల్గొని లలిత నగర్ దుర్గ ఆలయం వద్ద నమన ధనరాజు అండ్ సన్స్ ,పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన బ్లూ వాసన్ పంపిణీ అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. దీనిలో పంతం కొండలరావు, నమన వాసు, లలితా నగర్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు సహా అనేక జంతు ప్రేమికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్. జి.వి.ఎస్. నాగేశ్వర రావు, పి సాయి,బి.విమల, బి.కిరణ్ డాక్టర్. బి.హెచ్.వి. రమాదేవి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు

**పోలీస్ ఆర్ అండ్ బి శాఖల ఆధ్వర్యంలో తుప్పలు పిచ్చి మొక్కలు తొలగింపు**




**మండపేట మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలం కేశవరం నుండి అనపర్తి వరకు కెనాల్ రోడ్ లో ఓ వైపు తుప్పలు, పిచ్చి మొక్కలు కొన్ని ప్రధాన మలుపులు వద్ద ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.ఈ నేపథ్యంలో ఈ సమస్యను గుర్తించిన రూరల్ సి ఐ దొరరాజు ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పరిష్కరించారు. ప్రొక్లైన్ తో ఆయా చోట్ల తుప్పలు పిచ్చి మొక్కలు మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా సి ఐ దొరరాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్ల ను గుర్తించి నట్లు తెలిపారు.అక్కడ పెరిగిన పొదలను తొలగించే ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.ఈ క్రమంలో ఆర్ అండ్ బి డీఈ సూర్యనారాయణ మండపేట రూరల్ ఎస్.ఐ వి. కిశోర్ లతో సమన్వయంతో సంబంధిత ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు.వెంటనే బుష్ క్లియరెన్స్ చేశామని చెప్పారు. దీని వల్ల వల్ల రహదారులపై క్లియరెన్స్ మెరుగుపడి, రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సహకరించాలని కోరారు.

## మునికూడలి ఇసుక ర్యాంపు నుండి ఆగని అక్రమ ఇసుక రవాణా

**ఇసుక లారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని మునుకూడలి గ్రామ ఇసుక ర్యాంపు నుండి నిత్యం రాత్రి వేళలో అక్రమ ఇసుక రవాణా అడ్డూ అదుపు లేకుండా జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో అక్రమంగా తరలిస్తున్న ఏపీ 39 టివై 2599 అను నెంబర్ గల లారీని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై డి రామ్ కుమార్ విలేకరులకు తెలిపారు. మైన్స్ అధికారుల,జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సీతానగరం మండల వ్యాప్తంగా ఉన్న ఇసుక ర్యాంపుల యాజమాన్యాల వారు ఇసుక రవాణా చేయాలని సాయంత్రం 6 దాటిన తర్వాత ఇసుక రవాణాను చేస్తే అట్టి లారీలను అదుపులోకి తీసుకుని తగిన ఫైన్ వేయడం జరుగుతుందని అన్నారు. తప్పనిసరిగా ఇసుకను తరలించే ప్రతి లారీకి బిల్లు ఉండాలని అన్నారు. బిల్లు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా నేరమని, ఎలాంటి బిల్లులు లేకుండా సీతానగరం మండలంలో ఇసుకను లారీల ద్వారా తరలిస్తే అట్టి లారీలకు మైన్స్ అధికారుల నేతృత్వంలో భారీగా ఫైన్ వేయడం జరుగుతుందని అన్నారు. ఇసుకను అక్రమంగా తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే చట్టరీత్యా నేరమని తెలిపారు. సాయంత్రం 6 దాటిన తర్వాత మునికూడలి ఇసుక ర్యాంపు నుండి తరలిపోతున్న ఇసుక లారీని అదుపులోనికి తీసుకుని తగిన ఫైన్ వేయడం జరిగిందని ఎస్ఐ డి రామ్ కుమార్ విలేకరులకు తెలియజేశారు.







## ఇమామ్‌ల గౌరవ వేతనాలు విడుదల పట్ల హర్షం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇమామ్, మౌజన్లకు రంజాన్ సందర్భంగా ప్రభుత్వం గౌరవవేతనలు విడుదల చేయడం పట్ల మండపేట టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు షేక్ కరీం మెకానిక్ హర్షం వ్యక్తం చేశారు. మండపేట టిడిపి కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఇమామ్ మౌజన్ల గౌరవ వేతనం నిమిత్తం రూ.45 కోట్లు విడుదల చేశారన్నారు.గత ఆరు నెలల బకాయిలను రంజాన్ సందర్భంగా ఒకేసారి క్లియర్ చేసిన కూటమి ప్రభుత్వం కు కృతజ్ఞతలు తెలిపారు. ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన కొన్ని గంటల్లోనే నిధుల విడుదలకు ఆదేశాలు వచ్చాయన్నారు. ఇమామ్‌లు, మౌజన్‌ల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ అవుతుందన్నారు. ఇమామ్‌లకు ఆరు నెలల వేతనం కింద రూ.30 కోట్ల చెల్లింపులు చేస్తారన్నారు మౌజన్లకు ఆరు నెలల వేతనం కింద రూ.15 కోట్లు జమ చేస్తారని పేర్కొన్నారు.ఈ సమావేశంలో టీడీపీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు సలీం తదితరులు పాల్గొన్నారు.

## అబద్ధపు చరిత్రలను దశాబ్దాలుగా బిడ్డల చేత చదివిస్తున్నారు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కులం ఉద్యమాలు చేస్తున్న అనేకులు ఆ కులం వారు కాదు.ఆ కులం ఉద్యమాల్లో మాత్రం చురుకైన పాత్రలు పోషిస్తు సామాజిక కాలుష్యానికి చిరునామాగా నిలుస్తున్నారు. విద్యాలయాల్లో కులం రిజర్వేషన్ కావాలనుకునే వారికి శాస్త్రీయ పరమైన (డి ఎన్ ఎ) సర్టిఫికెట్ తప్పనిసరి చేస్తు ఆదేశాలు అమలు చేయాలి. కులం -మతం కాదు సంపద ముఖ్యం అనే రోజులు ప్రజలు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు . సమ సమానత్వంతో అందరు సంపన్నులే.. ప్రస్తుతం అంటరాని వారిగా అవమానాలు ఎదుర్కొంటున్న వారు అందరు ఒకప్పటి ఉన్నత వర్గాలు అని తెలుసుకునే రోజులు వస్తాయి .. ప్రస్తుతం సంపద ఉన్నోడు గొప్పోడు . సంపద లేనోడు అంటరాని వాడు అన్నట్టు వుంది. కులం , మతం వంశం ఉన్నోడికి ఆ సంఘాలతో పని లేదు. పేరు చివర కులం చిహ్నం తోకలు అవసరం లేదు. అవి ఏమి లేనివాడే ఎక్కువగా కులం ఉద్యమాలు అంటుంటారు. పేరు చివర కులం తోకలు తగిలించుకుంటాడు.

# దివ్యాంగుల ఆర్థిక సాధికారతకు కేంద్రం కట్టుబడి ఉంది

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

దేశవ్యాప్తంగా ఉన్న దివ్యాంగజనుల ఆర్థిక సాధికారతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కీలక సాధనమని అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు. పార్లమెంట్‌లో జరిగిన చర్చ సందర్భంగా ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. దివ్యాంగులు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు, అలాగే వివిధ రంగాలలో ఉద్యోగ అవకాశాలను పొందేందుకు నైపుణ్యాభివృద్ధి అత్యంత అవసరమని ఆయన వివరించారు. ప్రభుత్వం ఈ దిశగా పలు కార్యక్రమాలు చేపడుతూ, దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కేవలం ఉపాధి అవకాశాలను పెంపొందించడం మాత్రమే కాకుండా, దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి సమాజంలో సమాన

**ఎంపీ హరీష్ బాలయోగి**



భాగస్వామ్యాన్ని కల్పించడంలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని ఎంపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు దేశం నలుమూలలకూ విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సంబంధిత కేంద్ర మంత్రిని ఆయన కోరుతూ, అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గంలోని దివ్యాంగజనుల కోసం ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేసి విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్యల ద్వారా స్థానికంగా ఉన్న దివ్యాంగులు ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధించి, సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందేలా మార్గం సుగమం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దివ్యాంగుల సాధికారతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సమాజంలో సమానత్వాన్ని పెంపొందించడమే కాకుండా, సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని ఎంపీ హరీష్ బాలయోగి స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

### జిల్లా వ్యాప్తంగా స్టాప్, వాష్ అండ్ గో కార్యక్రమం : జిల్లా ఎస్పి రాహుల్ మీనా

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే ధ్యేయంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు స్టాప్, వాష్ అండ్ గో కార్యక్రమాన్ని పోలీసు యంత్రాంగం ముమ్మరంగా నిర్వహిస్తోంది. అర్ధరాత్రి, తెల్లవారుజామున వాహనాలు నడిపే డ్రైవర్లు నిద్రమత్తులోకి జారుకోవడం వల్ల జాతీయ, రాష్ట్ర రహదారులపై అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించిన పోలీసు శాఖ ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. అర్ధరాత్రి తర్వాత హైవేలపై ప్రయాణించే లారీలు, బస్సులు, వ్యాన్లు మరియు కార్లను పోలీసులు నిలిపివేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిద్రమత్తులో ఉన్న డ్రైవర్లను గుర్తించి వారిని వాహనం నుంచి దింపి, నీళ్లతో ముఖం కడిగించి వారు పూర్తిగా అప్రమత్తంగా అయిన తర్వాతే ప్రయాణానికి అనుమతిస్తున్నారు. అలాగే వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు తమ క్షేమం మాత్రమే కాకుండా ఇంటి వద్ద ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ మాట్లాడుతూ ప్రతి ప్రాణం విలువైనదని, డ్రైవర్లు కాసేపు విశ్రాంతి తీసుకోవడం లేదా ముఖం కడుక్కోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. నిద్రమత్తు వల్ల కలిగే ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు, డ్రైవర్లు పోలీసులకు సహకరించాలని కోరారు.

# మత సామరస్యానికి ప్రతీకగా జిల్లా స్థాయి ఇఫ్తార్ విందు

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

మత సామరస్యం, ఆత్మీయతకు ప్రతీక ఇఫ్తార్ విందు అని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు. మంగళవారం స్థానిక సత్యనారాయణ గార్డెన్‌లో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారిక ఇఫ్తార్ విందు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముస్లిం సోదరులందరికీ హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి, సహనానికి ప్రతీక అని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో మత సామరస్యం, సోదరభావాన్ని మరింత పటిష్టం చేస్తాయని పేర్కొన్నారు. అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి**




పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. రంజాన్ మాసం ఉపవాసం, ఆత్మపరిశీలన, సహనం, దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ కాలంలో ముస్లిం సోదర సోదరీమణులు ఆధ్యాత్మిక విలువలను ఆచరిస్తూ సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తున్నారని చెప్పారు. ఇఫ్తార్ విందులు పరస్పర గౌరవం, ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని అన్నారు. వివిధ మతాలు, సంస్కృతులకు చెందిన ప్రజలు ఒకే వేదికపై చేరి స్నేహభావంతో కలిసిమెలిసి ఉండటం భారతీయ సంస్కృతికి గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్ మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సామాజిక సమగ్రత కోసం అందరం కలసికట్టుగా పనిచేయడం అవసరమని అన్నారు. పరస్పర సహకారం, గౌరవం, సానుభూతి భావం సమాజాన్ని మరింత బలంగా నిలబెడతాయని చెప్పారు. ప్రతి కుటుంబంలో శాంతి, సౌభ్రాతృత్వం, సమృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు. సిపిఓ మురళీకృష్ణ మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారని తెలిపారు. జిల్లా టూరిజం అధికారి అన్వర్ మాట్లాడుతూ అల్లా ఆశీస్సులు అందరికీ లభించాలని కోరారు. రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని, ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఎల్‌డిఎం కేశవ వర్మ మాట్లాడుతూ, రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, ఆధ్యాత్మిక చింతనకు ప్రతీక అని, ముస్లిం మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్య, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు మైనారిటీల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, వికాస్ జిల్లా మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏటిగట్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తాం

### రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండలం తీర ప్రాంత సమీపంలో ఉన్న వరిచేలు సముద్రపు నీరు పోటు ఎత్తడంతో పండడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నిళ్ళుగా ఇదే పరిస్థితి రావడంతో పండించడం మానేశారు. మంగళవారం ఆ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు రైతులకు హామీ ఇచ్చారు. పాడైపోయిన షట్టర్ ప్రాంతంలో కొత్త షటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఏటుగట్టు నిర్మాణానికి రెండు కోట్లు మంజూరు చేశామని, అది పూర్తి అయిపోయిన తర్వాత పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి చేయడానికి మరో 10 కోట్లు తీసుకొస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఏటిగట్టు ఆక్రమణలను తొలగించి హెడ్ వర్క్స్ కు అప్పచెప్పాలని తాసిల్దార్ రవికిరణ్ ను ఎమ్మెల్యే ఆదేశించారు అనంతరం సత్తమ్మ చెట్టు ప్రాథమిక పాఠశాలకు వెళ్లి పిల్లలకు పెడుతున్న ఆహారాన్నిపరిశీలించారు. ఆయన ఆహారాన్ని రుచి చూశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కాట్రేనికోన హైస్కూల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను పరిశీలించారు. వెంటనే వాటి నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షుడు చెల్లి సురేష్, నీటి సంఘం డైరెక్టర్ వాసంశెట్టి రాజేశ్వరరావు, కాట్రేనికోన సొసైటీ డైరెక్టర్ మోకా అప్పాజీ, మండల టిడిపి యూత్ అధ్యక్షుడు వంగా దుర్గ బాబు, టిడిపి నాయకులు పచ్చమట్ల సూర్యనారాయణ రాజు, కాంద్రేగుల సత్య ప్రసాద్, వనసర్ల నాగేశ్వరరావు, శీలం సూర్యనారాయణ, జంగా శ్రీనివాసరావు, బండారు ఏసు, నల్ల రామకృష్ణకదలి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సేవలే చిరకాలం నిలుస్తాయి

### ఐదేళ్ల సేవలకు గౌరవ వందనం - రామచంద్రపురం మున్సిపాలిటీ కౌన్సిల్‌కు ఘన వీడ్కోలు - "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" ఆధ్వర్యంలో సత్కారం

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు, సమాజానికి చేసిన మంచి పనులే శాశ్వతంగా ప్రజల మదిలో నిలిచిపోతాయని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. రామచంద్రపురం మున్సిపాలిటీ కౌన్సిల్ పదవీకాలం మంగళవారంతో ముగిసిన నేపథ్యంలో చివరి అత్యవసర సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో గత ఐదేళ్ల అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించడంతో పాటు, పట్టణ ప్రగతిలో కౌన్సిల్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం జరిగిన ప్రత్యేక సత్కార కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ లు పాల్గొని కౌన్సిల్ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఐదేళ్లపాటు కృషి చేసిన చైర్ పర్సన్, ప్రతి కౌన్సిలర్ అభినందనీయులు అని పేర్కొన్నారు. ఎంతకాలం పదవిలో ఉన్నామన్నది ముఖ్యం కాదని, ప్రజల మనసులో సుస్థిరమైన స్థానం సంపాదించుకోవడమే ప్రజాప్రతినిధులకు ఆత్మసంతృప్తి, గౌరవం అన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నాయకత్వంలో మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పట్టణానికి కొత్త దిశను చూపారని ఆయన కొనియాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించారని ప్రశంసలు కురిపించారు. జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి సుభాస్



పార్టీలకు అతీతంగా అభివృద్ధి,సంక్షేమం చేస్తూ ముందుకు వెళుతున్నారన్నారు. విజయవంతంగా పదవీకాలం ముగించుకున్న ప్రజాప్రతినిధులందరికీ శుభాకాంక్షలు, ఘన వీడ్కోలు పలికారు. అనంతరం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవితో పాటు అన్ని వార్డుల కౌన్సిలర్లను జ్ఞాపికలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. రాజు, డి. శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది కూడా పదవీకాలం ముగిసిన ప్రజా ప్రతినిధులను ఘనంగా సత్కరించి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కమ్మిరెడ్డి పాలెం - వాడపాలెం రహదారి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కమ్మిరెడ్డి పాలెం - వాడపాలెం రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆయన రహదారి పనులను పరిశీలించారు. రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు రహదారిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

# పలివెల శేరిపాలెంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పంచ సూత్రాలతో వ్యవసాయం పండగ కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు మేలు రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, పంచ సూత్రాలతో వ్యవసాయం పండగలా మారుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కొత్తపేట మండలం పలివెల సేరిపాలెంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతన్నా మీకోసం కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలను మూడు దఫాలుగా రైతుల ఖాతాల్లో జమ చేసామని తెలియజేశారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో పంచ సూత్రాలతో రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామని తెలిపారు. నీటి భద్రత కింద ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో పోలవరం వెలిగొండ తదితర ప్రాజెక్టులు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అగ్రిటెక్ లో భాగంగా ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్లు మొదలైనవి సబ్సిడీపై అందిస్తుందన్నారు. డిమాండ్ ఆధారిత పంటల సాగుపై రైతులు ఆ అవగాహన పెంచుకోవాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, వ్యవసాయధారిత పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పేరుతో రైతులను నిలువునా మోసం చేశారన్నారు. ఏడాదికి రూ.7500 మాత్రమే రైతుల ఖాతాలో జమ చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చెప్పింది చెప్పినట్లుగా రూ.20 వేలను పీఎం కిసాన్ పథకంతో కలిపి రైతుల ఖాతాలో జమ చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం సేకరణ నగదు రైతులకు జమ కావడానికి ఆరు నెలల వరకు సమయం పట్టేది అన్నారు. ఇప్పుడు ధాన్యం అమ్మిన వెంటనే 24 గంటల్లో రైతులు ఖాతాలో నగదు జమవుతుందన్నారు. ఈ విధంగా అన్నదాతల అభ్యున్నతికి అవిశ్రాంతంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భరత్‌కు ఉగాది సాహితీ పురస్కారం అందజేసిన శ్రీశ్రీ కళావేదిక




**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో యర్రాప్రగడ సూర్య ప్రకాశరావు కళ్యాణమండపం నందు చైతన్య సారస్వత పరిషత్ మరియు శ్రీ శ్రీ కళావేదిక కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది సాహితీ ఉత్సవాలు 165 వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా దివ్యాంగుల సమస్యలపై పోరాడుతూ గతంలో దివ్యాంగుల హక్కుల చట్టం 2016 అమలు జిల్లా కమిటీ సభ్యునిగా పనిచేసి తద్వారా ప్రభుత్వ అధికారుల గుర్తింపు పొంది ప్రస్తుతం జిల్లా పౌరసరఫరాల విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్న మండపేట నియోజకవర్గం రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన ఖండవిల్లి భరత్ కుమార్ కు శ్రీశ్రీ కళావేదిక జిల్లా కన్వీనర్ కత్తిమండ ప్రతాప్ కుమార్ జ్ఞాపిక , దుస్సాలువా కప్పి ఉగాది సాహితి పురస్కారం అందజేశారు. ఉగాది పురస్కారం అందుకున్న భరత్ కుమార్ కు గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ రిమ్మలపూడి వేణుగోపాల దొర, సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, మాజీ సర్పంచ్ వాసంశెట్టి రాధాకృష్ణ, మండల వైస్ ఎంపీపీ జి. సుబ్రమణ్యం, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు జి. సత్యం, అరుంధతి సంఘ పెద్దలు, జై భీమ్ యూత్ సభ్యులు, గ్రామ 14 సంఘాల ప్రతినిధులు, రాయవరం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, మండల, గ్రామస్థాయి అన్ని శాఖల అధికారులు అభినందనలు తెలిపారు.

### ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా


# పారిశుద్ధ్య కార్మికులకు ఘన సత్కారం

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**




ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పొనుగుపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను ప్రత్యేకంగా సత్కరించారు. సమాజంలో పరిశుభ్రతను కాపాడుతూ కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడుతూ వారికి శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, నగర పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అమూల్యమని, వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పారిశుద్ధ్య కార్మికులను ప్రత్యేకంగా అభినందిస్తూ వారి కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమలాపురం మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, పట్టణ అధ్యక్షులు అయ్యల భాషా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సత్సంఘంలో సాగుతూ అందరినీ ఆకట్టుకుంది.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. మంగళవారం అమలాపురంలోని సత్యనారాయణ కళ్యాణ మండపంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కులమతాలకు అతీతంగా సమాజంలోని ప్రతి వర్గం కలిసి మెలిసి జీవించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మతసామరస్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముస్లిం సోదరుల అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో పరిశుభ్రత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలి

### - లాలాచెరువు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలను తనిఖీ - మరుగుదొడ్ల శుభ్రతను పరిశీలన చేసిన ఎమ్మెల్సీ సోమువీర్రాజు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం ఉదయం ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్థానిక లాలాచెరువు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలను తనిఖీ చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ పాఠశాలలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతుల మెరుగుదలపై దృష్టి సారిస్తూ నేడు లాలాచెరువు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో విద్యార్థుల మరుగుదొడ్లను పరిశీలించాను. మరుగుదొడ్ల పరిశుభ్రత, నీటి సౌకర్యం, నిర్వహణ విధానాన్ని సమీక్షించాను. విద్యార్థులు ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువుకునేందుకు పరిశుభ్రమైన శౌచాలయాలు అత్యంత అవసరం అని భావిస్తున్నాము. పిల్లల ఆరోగ్య రక్షణకు, శుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రతి పాఠశాలలో పరిశుభ్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా అవసరమైన చర్యలు తీసుకుంటూ, విద్యార్థుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.

# ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి

### వైసీపీ నేత కుంచే రమణారావు




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి :** టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ డ్రగ్స్ పార్టీలో అడ్డంగా దొరికిపోయిన ఘటనపై వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు లోక్‌సభ సభ్యుడు మహేష్ యాదవ్ ఇతర మాజీ ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలతో కలిసి రేవ్ పార్టీలో డ్రగ్స్ సేవిస్తూ పోలీసులకు చిక్కడం రాష్ట్రానికే అవమానకరమని అన్నారు. బయట డ్రగ్స్ నిర్మూలన గురించి ఉపన్యాసాలు ఇచ్చే నారా చంద్రబాబు నాయుడు, లోపల ఇలాంటి డ్రగ్స్ బానిసలను చట్టసభల్లో కూర్చోబెట్టారని ధ్వజమెత్తారు. పట్టుబడిన తర్వాత పోలీసుల ఈగిల్ టీంపై కాల్పులు జరపడం గూండా రాజ్యానికి నిదర్శమని విమర్శించారు. ఇంత దారుణంగా అధికార పార్టీ ఎంపీ డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడినా ఇంకా టీడీపీ స్పందించకపోవడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. ఆయనతో వెంటనే రాజీనామా చేయించకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. డ్రగ్స్ నిర్మూలించాలని బయట ప్రచారం చేస్తూ లోపల మాత్రం అదే డ్రగ్స్ వినియోగించడం సిగ్గుచేటు కాదా అని రమణారావు నిలదీశారు.

# బవురువాక చిటికెలకొండ అడవిలో పులి సురక్షితం..!

**అక్కడే మాటువేసిన 11 హనుమాన్ బృందాలు - మరో 3 ట్రాంక్విలైజింగ్ బృందాలు- 17 రోజుల్లో 250 కిలోమీటర్ల పులి ప్రయాణం**
**15 పెంపుడు పశువులపై పులి దాడి - 17 రోజుల అటవీశాఖ విశ్వ ప్రయత్నాలూ వ్యర్థం**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం అటవీశాఖ రేంజి శంఖవరం అటవీశాఖ సెక్షన్ ప్రత్తిపాడు మండలం బవురువాక సమీపంలోని దట్టమైన చిటికెల కొండ అడవిలోకి మంగళవారం సాయంత్రం 5.45 గంటలకు పులి చేరుకున్నట్లు అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. ఇక్కడ కూడా పులి సురక్షితంగా ఉన్నట్లు అటవీశాఖ అధికారులు ప్రకటించారు. సోమవారం 16 తేది తెల్లవారు జామున శంఖవరం మండలం మండపం నుంచి పులి మళ్లీ శంఖవరం మీదుగా గొంధి కొత్తపల్లి, మాసంపల్లి, గౌరంపేట గ్రామాల సమీపం లోనికి సాయంత్రం 5 గంటలకు తిరిగి వచ్చింది. ఐతే ఆ రాత్రి మాసంపల్లిలోనే పులి తిష్ట వేసింది. మంగళవారం సాయంత్రం 5.45 గంటలకు బవురువాక చిటికెల కొండ అడవిలోకి చేరుకుంది. అడవి పులికి సురక్షితం గనుక పులి తిరిగి గ్రామాల వైపు మైదానం ప్రాంతాల్లోకి తిరిగి వస్తే మత్తు మందు ఇంజెక్షన్లతో పులిని సురక్షితంగా బందించేందుకు 11 హనుమాన్ బృందాలు, 3 ట్రాంక్విలైజింగ్ బృందాలు సంసిద్ధంగా ఉన్నాయి. కృత్రిమ మేధ సాంకేతిక సహాయంతో పులి అన్వేషణ కొనసాగుతోంది. ప్రత్తిపాడు నియోజకవర్గలో ఈ 17 రోజుల వ్యవధిలో ఇప్పటి వరకూ ఈ పులి సుమారు 250 కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. సుమారు 15 పశువులపై దాడి చేసిందని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. పులిని పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు, ప్రత్యేక బృందాల సిబ్బంది చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటి వరకూ ఫలించలేదు.



ఐనప్పటికీ పట్టుకునే విశ్వ ప్రయత్నాలు యధావిధిగా కొనసాగు తున్నాయి. సరైన సమయంలో సరైన ప్రదేశంలో పులిని సురక్షితంగా పట్టుకోవడమే లక్ష్యంగా అధికారులు తమ వంతు కృషి చేస్తున్నారు. పగటి పూట మాత్రమే కాదు రాత్రి సమయంలో కూడా డ్రోన్లతో పులి కదలికలపై నిఘా కొనసాగిస్తున్నారు. పులి సంచరించే ప్రదేశాన్ని రాష్ట్ర ప్రభుత్వ అటవీశాఖ సలహాదారు పి.మల్లికార్జునరావు మంగళవారం పరిశీలించారు.

# వైభవంగా నూకాలమ్మ జాతర

## భారీ స్థాయిలో తరలి వచ్చిన భక్తులు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలో గ్రామ దేవతకి పిలవబడుతున్న నూకాలమ్మ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించి చున్నారు. ఉగాది పురస్కరించుటకు గ్రామంలో అమ్మవారి జాతరలో అంగరంగ వైభవంగా నిర్వహించి చున్నారు. ముఖ్యంగా నగరంలో నాలుగైదు ప్రాంతాల్లో ఈ అమ్మవారి జాతర జరుగుతుంది. ముఖ్యంగా ఆడపడుచులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకుంటారు అమ్మవారికి నివేదన కూడా సమర్పించడం జరిగింది ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నీ మించిపోయిన ఆలయ కమిటీలు జాతరకు ప్రత్యేక ఏర్పాటుచేశారు. భక్తులు దర్శనానికి ఎటువంటి ఆటంకాలు జరగకుండా పోలీసు బందోబస్తుని కూడా ఏర్పాటు చేశారు పెద్ద మార్కెట్లో ఆలయ కానీ నిద్ర కూడా హాధికారి మురళి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాద వితరణ చేయడం జరిగింది ప్రత్యేక దర్శనానికి టిక్కెట్లు కూడా ఏర్పాటు చేసి ఆలయానికి ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపట్టాడు ఫోటో పండయి పాలెం రమణయ్యపేట పెద్ద మార్కెట్ సెంటర్లలో అమ్మవారి ఆలయాల వద్ద భక్తులు పోతూ ఎత్తారు. ఆలయ ప్రాంతం అంతా విద్యుత్ దీపాలు అలంకరణతో ఏర్పాటు చేశారు.

# సిఐటియు జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సిఐటియు తూర్పుగోదావరి జిల్లా 12వ మహాసభలు ఏప్రిల్ 1,2 తేదీలలో జరగనున్నాయి. స్థానిక బాలాజీ దాస్ చౌక్ సెంటర్లో ఉన్న సీఐటీయు జిల్లా కార్యాలయంలో జిల్లా నాయకత్వం పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుందర్ బాబు, బి. పవన్ లు మాట్లాడుతూ ఈ మహాసభలలో కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ దానిని ప్రతిఘటించి కార్మిక హక్కుల రక్షణకు ఏరకమైన పోరాటాలు నిర్వహించాలి అని అంశాలు చర్చిస్తామని తెలిపారు. కార్మికవర్గం ఐక్యంగా హక్కుల రక్షణ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయు ఈ జిల్లాలో ప్రధాన పరిశ్రమలలో కార్మికుల హక్కుల కాపాడడానికి అనేక ఉద్యమాలు నిర్వహిస్తుంది అని తెలిపారు. ప్రభుత్వం యజమానులు పక్షాన ఉండి కార్మికులని బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చింది అని విమర్శించారు. షాప్స్ అండ్ ఎస్టాబ్లిస్ మెంట్ చట్టాన్ని సవరించి రోజుకు 24 గంటలు వారంలో 7 రోజులు తెరచి ఉంచవచ్చు అని జి ఓ 5ను మార్చి 12-2026 న విడుదల చేసింది అని దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. కార్మిక చట్టాల ప్రకారం 8 గంటలు మించిన పనికి డబుల్ ఓటీ ఇవ్వాలని అన్నారు. ఇటువంటి కీలక సమయంలో జరుగుతున్న జిల్లా మహాసభలకు అన్ని సీఐటీయు అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని అన్నారు. ప్రజలు, కార్మికవర్గం శ్రేయోభిలాషులు మహాసభల నిర్వహణకు సంహకరించి జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో సీఐటీయు జిల్లా నాయకత్వం ఎస్ ఎస్ మూర్తి,టి.అరుణ్, రామచంద్రరావు,బి పూర్ణిమారాజు, టి.తులసి, వై.బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

# మంగళవారంతో ముగిసిన మున్సిపల్ కౌన్సిలర్ల పదవి కాలం

## మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లకు ఘన సత్కారం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గా రాణి, టిడిపి వైసిపి 30 వార్డుల కౌన్సిలర్ల కు కోఆప్షన్ సభ్యులను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కౌన్సిల్ సమావేశం అనంతరం ఈ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్ల పదవి కాలం ముగియడం తో ఈ కార్యక్రమం ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఎక్స్ అఫిషియో సభ్యులుగా పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో చైర్ పర్సన్ ను ఘనంగా సత్కరించారు. ఈ క్రమంలో అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ చైర్ పర్సన్ ను అభినందించడానికి మండపేట కౌన్సిల్ సమావేశానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చింత అనురాధ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు నేతృత్వంలో కమిషనర్ టీవీ రంగారావు ఆధ్వర్యంలో చైర్ పర్సన్ ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఒకటవ వార్డు నుండి 30 వ వార్డు వరకు కౌన్సిలర్లను దుస్సలువా పూలమాలలతో సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. మహిళా కౌన్సిలర్ కు వారి భర్తలు బంధువులు చేత పూల మాలలు వేసి సత్కరించారు. అనంతరం కో ఆప్షన్ సభ్యులను ఘనంగా సత్కరించారు. మండపేట కు చెందిన వివిధ వ్యాపార వాణిజ్య వర్గాలకు చెందిన వారు వైసీపీ, టీడీపీ బీజేపీ, జన సేన నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి చైర్ పర్సన్, కౌన్సిలర్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డి ఈ శ్రీనివాస్, ఏ ఇ లు పవన్, అనూష, మండపేట మెప్మా సి ఎం ఎం పి సుజాత, సానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, స్వచ్ఛ వార్డ్ సచివాలయాల మేనేజర్ దంటు శ్రీనివాస్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 19న రాజమహేంద్రవరంలో ఉగాది పురస్కార మహోత్సవం

## - ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం లోక్ సభ నియోజక వర్గంలోని కవులు, పండితులు, కళాకారులను సముచిత రీతిలో గౌరవించేందుకు "శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కార మహోత్సవం" గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు లోక్ సభ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ఉగాది పురస్కార మహోత్సవం ఆరోజు ఉదయం 8.30 గంటలకు నగరంలోని జె.కె. గార్డెన్స్,లో (జె.ఎన్.రోడ్) నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజక వర్గానికి చెందిన ప్రతిభావంతులైన కవులు, పండితులు, కళాకారులను సన్మానించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. సాంస్కృతిక రంగ అభివృద్ధికి ఈ పురస్కారాలు ప్రోత్సాహకరంగా నిలుస్తాయని దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు. సంబంధిత వర్గాల వారు, సాహితీ,సాంస్కృతికాభిమానులు, ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని దగ్గుబాటి పురందేశ్వరి కోరారు.

# దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం మరో కానుక

**రేపు 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**
**రాష్ట్రమంతటా దివ్యాంగులకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం**
**40 శాతం వైకల్యం దాటిన దివ్యాంగులకు పథకం వర్తింపు- 4 నుంచి 21 వర్గాల దివ్యాంగులకు 'దివ్యాంగ శక్తి' విస్తరణ**
**వెంట వచ్చే సహాయకులకు ఛార్జీల్లో 50 శాతం రాయితీ - 12.76 లక్షల మంది దివ్యాంగులు, సహాయకులకు లబ్ధి**
**ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.207 కోట్ల వ్యయం - ప్రతీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేల చేతుల మీదుగా పథకానికి శ్రీకారం**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఉగాది కానుక ప్రకటించింది. ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలోని దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించేలా 'దివ్యాంగ శక్తి' పథకాన్ని తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకానికి బుధవారం అమరావతిలో శ్రీకారం చుడతారు. అలాగే ప్రతీ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే దివ్యాంగ శక్తిని ప్రారంభించనున్నాను. ఈ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందని మరోసారి నిరూపించింది. గతేడాది డిసెంబర్ 3న నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని మాటిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఈరోజు ఆ మాట నిలబెట్టుకున్నారు.


**'స్త్రీశక్తి' బస్సులే 'దివ్యాంగ శక్తి'కి వర్తింపు**

ప్రస్తుతం 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు, 100 శాతం కంటి చూపు కోల్పోయిన వాళ్లకు, 100 శాతం మూగ, చెవిటి వారికి, అలాగే 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న మానసిక దివ్యాంగులు మాత్రమే ఏపీఎస్ ఆర్టీసీ సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వీరికి 50 శాతం రాయితీ లభిస్తోంది. 100 శాతం అంధత్వం, మానసిక వైకల్యం ఉన్నవారితో వచ్చే సహాయకులకు 50 శాతం రాయితీ లభిస్తోంది. అయితే 'దివ్యాంగ శక్తి' పథకం కింద దివ్యాంగులకు పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. 40 శాతం, లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు అందరికీ స్త్రీశక్తి పథకం కింద వర్తించే బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. అంటే దివ్యాంగులు ఇకపై సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఒక్క రూపాయి కూడా ఛార్జీ లేకుండా రాష్ట్రమంతా ప్రయాణం చేసే వెసులుబాటు లభించింది. అంతేకాదు, వారితో పాటు వచ్చే సహాయకులకు ఈ బస్సుల్లో 50 శాతం రాయితీ లభిస్తుంది.

**4 నుంచి 21 వర్గాలకు పథకం విస్తరణ**

ఇప్పటివరకు కేవలం 4 వర్గాల దివ్యాంగులకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండేది. ఇకపై 21 వర్గాల దివ్యాంగులకు ఈ సౌకర్యాన్ని విస్తరించింది. శారీరక-మానసిక దివ్యాంగులు, ఆటిజం, నాడీ సంబంధ వ్యాధులు, పార్కిన్సన్స్, తలసేమియా, హీమోఫిలియా, సికిల్ సెల్ వంటి వ్యాధిగ్రస్తులకు ఈ పథకంతో భరోసా కలుగుతుంది. ప్రస్తుతం 1.71 లక్షల దివ్యాంగులకే లబ్ధి చేకూరుతుండగా... పథకం విస్తరణతో ఇకపై 11.16 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం కలుగుతుంది. వీరిలో పురుషులు 6.86 లక్షల మంది ఉన్నారు. అలాగే ఇప్పటివరకు 33,800 మంది సహాయకులకే రాయితీ లభిస్తుండగా... ఇకపై 1.60 లక్షల మంది సహాయకులకు 50 శాతం రాయితీ లభించనుంది. దీంతో ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందే మొత్తం లబ్ధిదారుల సంఖ్య 2.05 లక్షల నుంచి 12.76 లక్షలకు పెరిగనుంది.

**7,264 బస్సుల్లో ఉచిత ప్రయాణం**



ఈరోజు నుంచి స్త్రీ శక్తి పథకం వర్తించే 7,264 బస్సుల్లో దివ్యాంగులు కూడా ఉచితంగా ప్రయాణించవచ్చు. ఏపీఎస్ ఆర్టీసీలో సుమారు 73 శాతం బస్సులకు ఈ పథకాన్ని వర్తింప చేశారు. ఇప్పటికే దివ్యాంగులు, వారి సహాయకులకు 3 సంవత్సరాల కాలానికి ఇచ్చిన పాసులు ఈ కొత్త పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసేందుకు ఉపయోగపడతాయి. ఉచిత ప్రయాణానికి అవసరమైన డిజిటల్ పాస్‌లు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్, ఏపీఎస్ ఆర్టీసీ యాప్ ద్వారా పొందవచ్చు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్లలోని 134 కౌంటర్లలో దివ్యాంగులకు సేవలు అందుతాయి. ఈ యాప్స్‌ను సదరం యాప్‌తో అనుసంధానించినందున ఫిజికల్ సర్టిఫికేట్ చూపించాల్సిన అవసరం లేదు. క్యూఆర్ కోడ్‌తో ఉచిత డిజిటల్ పాస్‌లు జారీ చేస్తారు.

**ఏడాదికి రూ.207 కోట్ల వ్యయం**

ఈ పథక అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం రూ.207 కోట్లు సబ్సిడీ అందిస్తుంది. దివ్యాంగుల్లో సామాజిక భాగస్వామ్యాన్ని పెంచేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం ఇది. స్త్రీ శక్తి పథకంతో రాష్ట్రంలో మహిళలకు ఆర్థిక వెసులు బాటు, సాధికారత కల్పించింది. గతేడాది ఆగస్ట్ 15న స్త్రీశక్తి పథకం ప్రారంభిస్తే... ఈ మార్చి 15 నాటికి... అంటే 7 నెలల్లో 52 కోట్ల ప్రయాణాలు మహిళలు ఉచితంగా చేశారు. దీనికి ఇప్పటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,826 కోట్లు రాయితీ భరించింది. మహిళల ఉచిత ప్రయాణాలకు రోజుకు ప్రభుత్వం రూ.8.57 కోట్లు ఖర్చు పెడుతోంది. సగటున 24.38 లక్షల మంది స్త్రీ శక్తిని రోజూ వినియోగించుకుంటున్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే ప్రతీ వందమందిలో 37 మంది మగవాళ్లు ఉంటే, 63 మంది మహిళలే ఉంటున్నారు. ఇది స్త్రీ శక్తి పథకం ఎంతలా సూపర్ హిట్ అయ్యిందో చెబుతోంది. దివ్యాంగ శక్తి కూడా ఇంతే ఆదరణ పొందుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దివ్యాంగులకు సమాజంలో సరైన స్థానం, గుర్తింపు, గౌరవం కల్పిస్తామన్న మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు 'దివ్యాంగ శక్తి' పథకం ప్రవేశ పెట్టడం ద్వారా మరోసారి నిలబెట్టుకున్నారు.

# బాపనమ్మతల్లి ఆశీస్సులు అందుకున్న ఆదివాసీ నాయకులు



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** బాపనమ్మ తల్లి దర్శించుకుని అమ్మవారు ఆదివాసీ నాయకులు ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ,పోలవరం జిల్లా,రంపచోడవరం నియోజకవర్గం,దేవీపట్నం మండల పరిధిలోని దేవారం గ్రామంలో ఉన్న గ్రామదేవత మాతృశ్రీ బాపనమ్మ తల్లి పండుగ,పప్పు కొత్త పండుగ సందర్భంగా గ్రామ దేవత మాతృశ్రీ బాపనమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.ముందుగా గ్రామంలోని ఆలయ పూజారి తెల్లం బాపన దొర ఆధ్వర్యంలో గ్రామస్తులందరూ మాతృశ్రీ బాపనమ్మ తల్లిని ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారన్నారు. మాతృశ్రీ బాపనమ్మ తల్లిని దర్శించుకొని ప్రజలు ఘనంగా నైవేద్యం సమర్పించారన్నారు.అనంతరం గ్రామంలోని చిన్నలు,పెద్దలు,మహిళలు,యువతీ యువకులు అందరికి అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లం కామన్న దొర,తెల్లం రామకృష్ణ దొర,తెల్లం నరేంద్ర దొర,తెల్లం మహేష్ దొర,మడకం మోహన్ రావు దొర,కారం రమేష్ దొర,కొమరం కుమార్ స్వామి దొర,కోసు శేఖర్ దొర,కోసు వెంకటేష్ దొర,పూసం వీరాంజనేయులు దొర,శారపు వీరబాబు దొర,ఎంపిటిసి సభ్యులు తుర్రం జగదీష్ దొర,కొమరం దుర్గాప్రసాద్ దొర మొదలైన వారు పాల్గొన్నారు.

# పైలేరియా వ్యాధి గ్రస్తులకు క్లీనింగ్ కిట్స్ పంపిణీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక వై-జంక్షన్ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఉన్న కంబాలపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో పైలేరియా సబ్ యూనిట్ ఆఫీస్ వారు అందించిన పైలేరియా క్లీనింగ్ కిట్స్(ప్లాస్టిక్ టబ్, మగ్గు, టవల్, డెట్టాల్, సబ్బులు, ఆయింట్మెంట్, మందులు) ను పైలేరియా వ్యాధి గ్రస్తులకు హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూహ్య మల్లాది, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ అనుసూరి శ్రీనివాస్ ల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూహ్య మాట్లాడుతూ ఈ వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనుసూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పైలేరియా వ్యాధి గ్రస్తులను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పైలేరియా సూపర్వైజర్ మధు, హాస్పిటల్ సూపర్వైజర్ డీడీ భవానీ, ఏఎన్ఎమ్ లు,ఆశాలు పాల్గొన్నారు.



### రూరల్ నియోజక వర్గానికి

# తాగునీటికి రూ.196.55కోట్లు

- రాజమండ్రి రూరల్ నుంచే మొదలుకానున్న ఇంటింటికి ఉచిత కుళాయి కనెక్షన్లు - 2027 నాటికి పోలవరం పూర్తిచేస్తాం
- గత ప్రభుత్వం నిర్వాకంతో ఆగిపోయిన జలజీవన మిషన్ చంద్రబాబు కృషి వల్ల మళ్ళీ మంజూరు
-సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ, అభివృద్ధి కొనసాగిస్తోంది - ఇంటింటికి సోలార్ పెట్టుకుంటే విద్యుత్ భారం తగ్గుతుంది
- చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల, శ్రేణులు పాలాభిషేకం




**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ వేదికగా తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం రూ 196. 55కోట్లు మంజూరు చేసిందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పారు. మంగళవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందులో రూరల్ లో , రాజనగరంలో పైప్ లైన్ల కోసం రూ 12కోట్లు చొప్పున వెచ్చిస్తారని తెలిపారు. గోదావరి చెంతనే ఉన్నప్పటికీ ధవళేశ్వరం, తొర్రేడు, కాతేరు, కొంతమూరు, తదితర ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉందని,గ్రిడ్ ఇక్కడ పెట్టుకుని ఈ ప్రాంతంలో నీటి ఎద్దడి లేకుండా చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి నిధులు మంజూరు చేసారని గోరంట్ల తెలిపారు. పుష్కరాలు వస్తున్నందున కొవ్వూరు కూడా కలపాలని కోరడంతో కొవ్వూరు చాగల్నాడుకి రూ 95కోట్లు మంజూరు చేసారని ఆయన తెలిపారు. మొత్తం రూ291కోట్ల రూపాయలకు పైగా వెచ్చించి ప్రాజెక్ట్ పనులు అవుతాయని తెలిపారు. గ్రిడ్ కంటే ముందు మన పనులు అయ్యే అవకాశం ఉందన్నారు. ఇంటింటికి ఉచిత కుళాయి కనెక్షన్ కూడా రూరల్ నుంచే ప్రారంభం కాబోతోందని గోరంట్ల తెలిపారు. గత ప్రభుత్వ నిర్వాకం వలన ఆగిపోయిన జల్ జీవన్ మిషన్ పనులు చంద్రబాబు కృషి వలన మళ్ళీ మొదలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, ఎం.పీ.పీ వెలుగుబంటి సత్య ప్రసాద్, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, కడియం మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాన్ని సత్యనారాయణ, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యమన నారాయణ గౌడ్, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు పండూరి అప్పారావు, దాలిపర్తి వేమన, డైరెక్టర్ కర్రీ అప్పలస్వామి, చప్పా చిన్నారావు, మద్దా మణి, దండమూడి ప్రమీల, పిల్ల తనూజ, పొన్నాల లక్ష్మీ సంతోషి, కురుకూరి కిషోర్, తలారి మూర్తి, శీలం గోవిందు, రొంపిచర్ల అంటోని, ఏడాకుల వెంకటేశ్వరరావు, చలమూరి సత్యనారాయణ, ఆళ్ల ఆనందరావు, బీరా ప్రకాష్, బొరుసు సుబ్రహ్మణ్యం, దండమూడి తేజ, దుద్దుపూడి రామకృష్ణ, బొప్పన నానాజీ, నిమ్మలపూడి రామకృష్ణ, మర్రెడ్డి రమేష్, పాతూరి రాజేష్, గుర్రపు సత్యనారాయణ, తాడేపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ నాయుడును

# పదవి నుంచి బర్తరఫ్ చెయ్యాలి

**తిరుమల పవిత్రతను కాపాడండి బిఆర్ నాయుడును తొలగించండి - మోరంపూడి జంక్షన్‌లో రోడ్డు బైటాయించి భారీ నిరసన**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో నిరసనలు వైఎస్సార్సీపీకి చెందిన మహిళలపై దాడి చేసి తిరిగి వారి పైనే తప్పుడు కేసులు పెట్టడాన్ని ఖండిస్తూ.. టిటిడి చైర్మన్ పదవికి బి.ఆర్ నాయుడు రాజీనామా చేయాలని రాజమండ్రి మోరంపూడి జంక్షన్ దగ్గర, డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని వైసీపీ నేతలు చేపట్టారు. అనంతరం వైసీపీ అధ్యక్షులు మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానన్నీ, స్వామి వారిని కోట్లాది మంది భక్తులు ఆరాధ్య దైవంగా భావిస్తారు. సీఎం చంద్రబాబు లడ్డులో కల్తీ జరిగిందని టీటీడీ కి మచ్చ తీసుకొచ్చారు. ఎంతోమంది గొప్ప వ్యక్తులు టీటీడీ చైర్మన్‌లుగా పని చేశారు. బి ఆర్ నాయుడు రుణం తీర్చుకోవటానికి ఆయనకు పదవి ఇచ్చారు,నాయుడు ఛైర్మన్ అయినప్పటి నుంచి దర్శనాల్లో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. మహిళల పట్ల అతని ప్రవర్తన సమాజం తలదించుకునేలా ఉంది. భక్తులు ఎంతోమంది అతన్ని చైర్మన్ పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. చంద్రబాబు తన సొంత మనిషి కాబట్టి విలేకరుల మరియు ఎవరు ఎన్ని సార్లు అడిగినా స్పందించటం లేదు. నా దైవం వెంకటేశ్వర స్వామీ అని చెప్పే చంద్రబాబు టిటిడిలో సమస్యలు వస్తె బి ఆర్ నాయుడును ఎందుకు తప్పించటం లేదని, టీటీడీని ప్రక్షాళన చేసి నాయుడు పై చర్యలు తీసుకోవాలని శాంతియుతంగా ధర్నా చేస్తే వారిపై దాడి చేయించారు. తిరిగి వారిపై కేసులు పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. పోలీసులు టీడీపీ కండువా కప్పుకొని పని చేస్తున్నారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న నాయకులు కి మంచి బుద్ధి ప్రసాదించాలని అంబేద్కర్ విగ్రహాశీ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్వయంగా టీడీపీ ఎంపీ డ్రగ్స్ కేసులో ఇరుకున్నాడు. ఆయనపై కూడా చర్యలు తీసుకోపోగా వెనకేసుకొస్తున్నారు. బీ ఆర్ నాయుడు నీ వెంటనే ఆపదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తానేటి వనిత,రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా ,జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్,మాజీ శాసన సభ్యులు గెడ్డం శ్రీనివాస నాయుడు,డా సత్తి సూర్యనారాయణ రెడ్డి, తలారి వెంకట్రావు, పార్లమెంట్ ఇంచార్జ్ డా గూడూరి శ్రీనివాస్ , గిరిజాల బాబు, మాజీ హోసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిళ రెడ్డి, అంగడి సత్య ప్రియ, అరె చిన్ని,అనంత లక్ష్మి,కృష్ణ వేణి, రాష్ట్ర కార్యదర్శులు,జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వ్యాఖ్యలపై మండిపడ్డ వైసీపీ నాయకులు

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ఇనుగంటి వారిపేటలో మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్ రావును ఉద్దేశించి జనసేన పార్టీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇటీవల కాలంలో చేసిన వ్యాఖ్యలపై ఆ గ్రామ సర్పంచ్ సత్యం శ్రీరామచంద్రమూర్తి (రాంపండు) ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో శ్రీరామచంద్రమూర్తి (రాంపండు) మాట్లాడుతూ సభ్య సమాజంలో ఉన్నామనే విషయాన్ని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మరిచి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కల్లు దుకాణాలనుంచో,సారా బట్టిల నుంచో వచ్చిన వారు ఆ విధంగా మాట్లాడతారని నేటి ఎమ్మెల్యే తీరు అలా ఉందని అన్నారు. జక్కంపూడి రాజా కుటుంబంపై చేసిన అసభ్య పదజాల వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకుంటే రానున్న రోజుల్లో రాజానగరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైసీపీ నాయకులు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. చేసిన అనుచిత వ్యాఖ్యలపై భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవలసిన అవసరం కూడా ఉంటుందని అన్నారు. రాజానగరం నియోజకవర్గంలో ఇలాంటి సంస్కృతి ఏనాడూ లేదని ఎమ్మెల్యే బలరామకృష్ణకు దేవుడిపై భక్తి లేదని అన్నారు. రెచ్చగొట్టే మాటలు మాట్లాడటం సరికాదని జక్కంపూడి రాజా ఒక మంత్రి తనయుడని,ఒక లాయర్ తనయుడని,జడ్జి మనవడు అనే విషయాన్ని మరచి ఒక సామాన్యుడని విమర్శించినట్లుగా విమర్శించడం నేటి ఎమ్మెల్యే బత్తుల



బలరామకృష్ణకు తగదని అన్నారు. జక్కంపూడి రాజా కుటుంబం గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యే బలరామ కృష్ణకు లేదని అన్నారు. అసభ్య పదజాలాన్ని మేమూ మాట్లాడగలమని అలా మాట్లాడితే ఎమ్మెల్యే బలరామకృష్ణకు మాకూ పెద్ద తేడా ఉండదని అన్నారు. జక్కంపూడి రాజా రాజానగరం నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని అభివృద్ధిని ప్రజల గుండెల్లో పెట్టుకున్నారని అన్నారు. ఆవకాశం వచ్చి ఎమ్మెల్యే అయినంత మాత్రాన అసభ్య పదజాలాన్ని వాడటం సరికాదని జక్కంపూడి కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని రాంపండు అన్నారు. బలరామకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా జక్కంపూడి అభిమానులు ప్రశ్నించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే వైకాపా నాయకుడు వైస్ ఎంపీపీ సత్యం మదన్మోహన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అనే వ్యక్తి అభివృద్ధిని గురించి మాట్లాడాలే గానీ జక్కంపూడి రాజా తల్లి,తండ్రి పట్ల అసభ్య పదజాలంగా మాట్లాడడం,విమర్శించడం వైసిపి నాయకులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం సరైన విధానం కాదని అన్నారు. ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడిన వ్యాఖ్యలపై జక్కంపూడి గణేష్ ఇచ్చిన కౌంటర్ కు ఎమ్మెల్యే మాట్లాడాలేని సందర్భం ఉందని అన్నారు. వైకాపా నాయకుడు కవల కృష్ణమూర్తి మాట్లాడుతూ వచ్చిన అవకాశానికి ప్రజలకు మంచి చేయాలే తప్ప జక్కంపూడి రాజాను విమర్శించడం తగదని అన్నారు. నేటి ఎమ్మెల్యే బలరామకృష్ణ జక్కంపూడి రామ్మోహన్ రావు పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. సామాన్య ప్రజల నుండి తన రాజకీయాన్ని మొదలుపెట్టి ఎదిగి రామ్మోహన్రావు రాష్ట్రంలోనే ఎన్నో పేరు ప్రఖ్యాతలు సాధించి ఎన్నో మంత్రి పదవులను దిగ్విజయంగా కొనసాగించారని అన్నారు. గాలివాటంలో నెగ్గిన నేటి ఎమ్మెల్యే బలరామకృష్ణ జక్కంపూడి కుటుంబ సభ్యులను విమర్శించే స్థాయి లేదని అన్నారు. నేటి ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు చేసింది ఏమీ లేదని కాపులకు ఎలాంటి కార్పొరేషన్ లోన్లు రప్పించలేదని అన్నారు. నేటికీ. కనీసం తన గెలుపు కోసం తిరిగిన వ్యక్తులకు రెండు సంవత్సరాల కాలం గడిచినా ఎమ్మెల్యే బలరామకృష్ణ ఏమి వి చేయలేకపోయారని అన్నారు. రాజానగరం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామం నుండి కాపు యువత కార్పొరేషన్ లోన్లు కోసం ప్రతీ గ్రామం నుండి 30 మందికి పైగా అప్లై చేసుకున్నారని వారికి ఎలాంటి లోన్లు నేటికీ అందలేదని అన్నారు. జక్కంపూడి విజయలక్ష్మి,జక్కంపూడి రామ్మోహన్ రావు జోలికి వెళ్తే నేటి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాతాళానికి వెళ్లడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కోనే కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కంబాల ఆధ్వర్యంలో ఘనంగా మాతృశ్రీ నూకాలమ్మ జాతర



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీరంగపట్నంలో మాతృశ్రీ నూకాలమ్మ ఆరోవ జాతర మహోత్సవాలను విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. మంగళవారం శ్రీరంగపట్నం గౌరీ చౌక్ లో మాతృశ్రీ నూకాలమ్మకు కంబాల శ్రీనివాసరావు పసుపు కుంకుమ, గాజులు పట్టువస్త్రాలు సమర్పించి, జాతర సందర్భంగా కంబాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవంలో పాల్గొని, గ్రామస్తులందరినీ ఆప్యాయతగా పలకరించారు. ఈ సందర్భంగా కంబాల మాట్లాడుతూ మన హిందూ సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం ఉగాది ముందు గ్రామాల్లో అమ్మవార్ల జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారన్నారు. అనంతరం అమ్మవార్లను పుట్టింటి నుంచి అత్తింటికి పసుపు కుంకుమ, చీర శారీలతో ఘనంగా పంపించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీసభ్యులు, గ్రామస్తులు కంబాల కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు నాటకాల రాంబాబు, సూరిశెట్టి చిన్నారి, కొయ్యడాల స్వర్ణకుమారి నానాజీ, పొలమరశెట్టి సత్యనారాయణ, శరకణం శివ, కొయ్యల శేఖర్, నీలకంఠం, రామసేన సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిడివో అధ్యక్షతన వార్డ్ మెంబర్లకు ఎంపీటీసీలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల పరిషత్ కార్యాలయం నందు సీతానగరం మండల అభివృద్ధి అధికారి అధ్యక్షతన వార్డు మెంబర్లకు ఎంపీటీసీలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది.ఈ శిక్షణ కార్యక్రమమునకు ఎంపీపీ, ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్లు, ఉప మండల పరిషత్ అధికారులు, పి.ఆర్ మరియు 'జియస్ డబ్ల్యూఎస్‌లు హాజరయ్యారు.ఈ శిక్షణకు టిఓటిలుగా యం.డి. రజాక్, ఉండేశ్వరపురం పంచాయతీ కార్యదర్శి మరియు ములకలంగి పంచాయతీ కార్యదర్శి వ్యవహరించారు.

# గ్రామాభివృద్ధికి 9 సుస్థిర లక్ష్యాలు, స్థానిక చర్యలపై శిక్షణ కార్యక్రమం

### ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, వార్డు సభ్యులకు శిక్షణ



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్దేశించిన 9 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను గ్రామస్థాయిలో అమలు చేయడం ఎంతో కీలకమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిటిసి లు, వార్డు మెంబర్ లకు ఎంపీడీవో ఆధ్వర్యంలో టిఓటి లు మంగళవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనతో పాటు మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యకరమైన గ్రామ వాతావరణం, శిశు స్నేహపూర్వక సేవలు, నీటి సమృద్ధి, పరిశుభ్రత--పచ్చదనం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళా సాధికారత వంటి 9 ముఖ్య అంశాలను ప్రతి గ్రామంలో కార్యాచరణ ప్రణాళికలుగా రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ లక్ష్యాలను కేవలం సిద్ధాంతాలుగా కాకుండా స్థానిక అవసరాలకు అనుగుణంగా చర్యలుగా మార్చడమే ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు ఈ లక్ష్యాలపై అవగాహన పెంపొందించుకుని గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీవో కృష్ణంరాజు, పంచాయతీ అభివృద్ధి అధికారి లొల్ల కృష్ణమూర్తి, రాయవరం గ్రేడ్--5 పంచాయతీ అభివృద్ధి అధికారి ఎం. వెంకటలక్ష్మి లు టిఓటి లుగా శిక్షణ ను అందించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# 49వ వార్డులో పారిశుద్ధ్యం అధ్వాన్నం : బర్రే కొండబాబు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి క్వారీ ప్రాంతంలోని 49వ వార్డులో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉందని నగరపాలకసంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు విమర్శించారు.ఈ వార్డులో పేద ప్రజలు,రెక్కాడితే కాని డొక్కాడని పేద కార్మికులు ఎక్కవగా నివసిస్తుంటారని,అలాంటి వార్డులో ఏ వీధిలో చూసినా కాలువల్లో మురుగు తొలగించడంలేదని ఆయన మండిపడ్డారు.మంగళవారం బర్రే కొండబాబు వార్డులో అధ్వాన్నం పారిశుధ్యం విషయమై మీడియాతో మాట్లాడుతూ నగరపాలకసంస్థ అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.ఏ కమిషనర్ వచ్చినా ఈ వార్డుపై శీతకన్ను వేస్తారని ఇక్కడి పరిస్థితిని మార్చడానికి ఎవరూ సరైన చర్యలు తీసుకోవడం లేదని అయన ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో ఈ వార్డులో 37మంది పారిశుధ్య కార్మికులు ఉండేవారని, ప్రస్తుతం 15 మంది మాత్రమే పని చేస్తున్నారని ఆయన తెలిపారు.ఈ 15 మందిని కూడా ఇక్కడ పూర్తిగా పని చేయనివ్వకుండా వేరే ప్రాంతాల్లో పనులకు వాడుతున్నారని ఆయన ఆరోపించారు.వార్డులో ఏ వీధి చూసినా కాలువల్లో మురుగు తొలగించడంలేదని, ఎక్కడికక్కడ అధ్వాన్నంగా ఉంటోందని బర్రే కొండబాబు విమర్శించారు.పారిశుధ్య కార్మికులను ఎందుకు తగ్గించారని ఆయన ప్రశ్నించారు.సిల్టు తీసే కార్మికులు కూడా లేరని తెలిపారు.నగరంలోని 50 వార్డుల్లో చెత్త తరలించే వాహనాలు పని పూర్తి అయిన తర్వాత వాటన్నింటిని ఈ ప్రాంతంలో నిలుపు చేస్తున్నారని, అపరిశుభ్రంగా ఉండే ఆ వాహనాల కారణంగా,క్వారీ గోతుల నీటివల్ల ఈ ప్రాంతంలో దోమలు పెరిగి పేద ప్రజలు డెంగూ మలేరియా ఫైలేరియా వంటి ప్రమాదకర వ్యాధులబారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారని బర్రే కొండబాబు ఆవేదన వ్యక్తం చేశారు.దీనికి కమిషనర్,హెల్త్ ఆఫీసరు బాధ్యత వహిస్తారా అని ఆయన ప్రశ్నించారు.క్వారీ ప్రాంతంలోని 45,46,47 48,49 వార్డుల ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతూ రోగాలబారిన పడుతున్నారని,ఆయన అన్నారు.49 వార్డులో పారిశుధ్య పరిస్థితిని చక్కదిద్దేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని బర్రే కొండబాబు డిమాండ్ చేశారు. వార్డులో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు తక్షణ చర్యలు చేపట్టకపోతే నగరపాలకసంస్థ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా సమస్య అలాగే ఉంటోందని,అందుకే ఆరోజునే కార్పొరేషన్ కార్యాలయం వద్ద ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని కొండబాబు చెప్పారు.వార్డు ప్రజలు కూడా కాలువల్లో చెత్త వేయకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ఇళ్ళలోని చెత్తను చెత్త తరలించే వాహనంలో వేయాలని బర్రే కొండబాబు సూచించారు.

### పసలపూడి సుజ్ఞాన కుమారికి విశ్వజనని

# ఉగాది పురస్కారం 2026



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాజిక సేవారంగంలో విశేష కృషి చేస్తున్న సాధన మహిళా మండలి అధ్యక్షురాలు పి సుజ్ఞాన కుమారి ప్రతిష్టాత్మకమైన విశ్వజనని ఉగాది పురస్కారం 2026 అందుకున్నారు.విజయవాడలో జరిగిన కార్యక్రమంలోవిశ్వజనని ఫౌండేషన్ వ్యవస్థాపకులు 'బొగ్గరపు బ్రహ్మానందం చేతులమీదుగా ఈ పురస్కారం ప్రధాన చేశారు. మహిళా సాధికారత శిశు సంక్షేమం కోసం ఆమె చేస్తున్న సేవలకు గాను ఈ గుర్తింపు లభించింది. ఈ అవార్డు తనపై బాధ్యతను పెంచిందని సుజ్ఞాన కుమారి అన్నారు.

### నేడు నరసాపురం, గాదరాడ గ్రామాల్లో

# విద్యుత్‌కు అంతరాయం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** నేడు కోరుకొండ మండలంలోని 33/11కెవి నరసాపురం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి నరసాపురం లోకల్,11 కేవీ రాజవరం ఎజిఎల్ ఫీడర్లు, సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజన్ తెలిపారు. బుధవారం నరసాపురం, గాదరాడ గ్రామాల్లో మధ్యాహ్నం 1గంటల నుండి సాయంత్రం 7గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడు తుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.





# బూతుపాట పాడి వివాదంలో ఇరుక్కున్న సింగర్ మంగ్లీ.. కేసు నమోదు

టాలీవుడ్‌లో ఇప్పుడు టాప్ సింగర్స్‌లో మంగ్లీ పేరు కూడా ఉంటుంది. తనదైన గాత్రంతో అద్భుతంగా పాటలు ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది మంగ్లీ. కెరీర్ బిగినింగ్ లో న్యూస్ ఛానల్ లో యాంకర్ గా చేసి.. ఆ తర్వాత బతుకమ్మ పాటలతో ఫేమస్ అయ్యింది మంగ్లీ. టాలీవుడ్ ఫోక్ సింగర్ మంగ్లీ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఇప్పుడు స్టార్ హీరోల సినిమాల్లో ప్లే బ్యాక్ సింగర్ గా అవకాశాలు సొంతం చేసుకుంటుందామె. ఒక్క తెలుగులోనే కాదు కన్నడ సినిమా ఇండస్ట్రీలోనూ ఈ బ్యూటిఫుల్ సింగర్ కు అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఇప్పుడు మంగ్లీ ఊహించని వివాదంలో చిక్కుకుంది. మంగ్లీ ప్రస్తుతం తమిళం, కన్నడ, హిందీ భాషలలో కూడా పాటలు పాడుతూ బిజీగా ఉంది.. ఈ క్రమంలోనే ఆమె ఓ కన్నడ సినిమాకు పాట పాడింది. కన్నడ హీరో ధ్రువ సర్జా హీరోగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం ఖణ: ది డెవిల్. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలోనే ఈ సినిమానుంచి "సర్కే చునర్ తేరి సర్కే" అంటూ సాగిపోయే ఈ స్పెషల్ సాంగ్ విడుదల చేశారు. ఈ సాంగ్ ఇప్పుడు వివాదంలో చుక్కుకుంది. సర్కే చునర్ తేరి సర్కే సాంగ్ విడుదలైన తర్వాత సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ సాంగ్ మొత్తం అశ్లీలంగా ఉండటంతో నెటిజన్స్ ఈ పాట పై పెద్దెత్తున విమర్శలు కురిపిస్తున్నారు. ఇది బూతు పాట అంటూ నెటిజన్స్ ఓ రేంజ్ లో మండిపడుతున్నారు. కాగా ఈ పాట పై ముంబైకి చెందిన ప్రముఖ న్యాయవాది వినీత్ జిందాల్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సర్టిఫికెట్, అలాగే సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు ఫిర్యాదులు చేశారు. ఈ పాట మైనర్ల పై చేడు ప్రభావం చూపే విధంగా ఉందని.. పాటను వెంటనే తొలగించాలని డిమాండ్స్ వినిపిస్తున్నాయి. అంతే కాదు.. ఈ పాట కోసం పనిచేసిన సంగీత దర్శకులు గాయని గాయకులపై కూడా ఫిర్యాదులు వెళ్లాయిసినిమా దర్శకుడు ప్రేమ్, ఈ పాట రచయిత రాకీబ్ ఆలం, మ్యూజిక్ డైరెక్టర్ అర్జున్ అలాగే సింగర్ మంగ్లీ పేర్లను కూడా ఫిర్యాదులో చేర్చారని తెలుస్తుంది. విమర్శలు రావడంతో సాంగ్ ను యూట్యూబ్ నుంచి తొలగించారు. ఇక దీని పై సింగర్ మంగ్లీ స్పందించలేదు.

# IMDBలో 7.1 రేటింగ్.. మెంటలెక్కించే థ్రిల్లర్ సినిమాలు..

థియేటర్లలో అయినా, ఓటీటీలో అయినా ప్రజెంట్ క్రైమ్ థ్రిల్లర్ సినిమాలదే హవా. ముఖ్యంగా ఓటీటీలో ఈ జానర్ సినిమాలకు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అలాంటి వారి కోసం ఓటీటీలో కొన్ని క్రైమ్ థ్రిల్లర్ మూవీస్ దూసుకుపోతున్నాయి. ఓటీటీలో బెస్ట్ థ్రిల్లర్ సినిమాలు ఇవే.. ఇప్పుడు వస్తున్న సినిమాలు ఓటీటీలను కూడా దృష్టిలో పెట్టుకోని తెరకెక్కిస్తున్నారు దర్శక నిర్మాతలు. కొన్ని సినిమాలు థియేటర్స్ లో ఫ్లాప్ అయినా కూడా ఓటీటీల్లో విడుదలై సంచలన విజయాలను అందుకుంటున్నాయి. అలాగే కొన్ని సినిమాలు డైరెక్ట్ గా ఓటీటీల్లో రిలీజ్ అయ్యి మంచి విజయాలను అందుకుంటున్నాయి. ఓటీటీల్లో ఎక్కువగా ట్రెండ్ అయ్యే సినిమాల్లో హారర్, థ్రిల్లర్, రొమాంటిక్ సినిమాలే ఎక్కువ ఉంటాయి. ఆడియన్స్ కూడా ఇలాంటి సినిమాలే చూడటానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. దాంతో దర్శక నిర్మాతలు ఇలాంటి సినిమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. కాగా ఇప్పుడు మనం కొన్ని థ్రిల్లర్ సినిమాల గురించి మాట్లాడుకుందాం..! ఈ సినిమాలు క్రైమ్ థ్రిల్లర్ డ్రామా నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కించారు. అంతే కాదు ఈ సినిమాలు సంచలన విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు ఓటీటీని ఊపేస్తున్నాయి. ప్రస్తుతం ఓటీటీలో ఉన్న బెస్ట్ థ్రిల్లర్ సినిమాల్లో మొదటిగా చెప్పుకోవాల్సింది.. సెక్టార్ 36:2006 సినిమా గురించి ఈ సినిమా నిజజీవిత ఘటన ఆదారంగా తెరకెక్కించారు. ఒక నగరంలో చిన్న పిల్లలు వరుసగా కనిపించకుండా పోతుంటారు. మొదట ఈ కేసులను పోలీసులు పెద్దగా పట్టించుకోరు. కానీ మిస్సింగ్ కేసులు పెరుగుతుండటంతో ఒక పోలీస్ ఆఫీసర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ఇన్వెస్టిగేషన్ ప్రారంభిస్తాడు ఆతర్వాత ఏం జరిగింది ఎలాంటి నిజాలు బయటపడ్డాయి అనే డి కథ.. ఈ సినిమా నెట్ నెట్ ఫ్లిక్స్ లో

## ఓటీటీలో బెస్ట్ మర్డర్ మిస్టరీ మూవీస్ ఇవే..



అందుబాటులో ఉంది. అలాగే రెండో సినిమా మండల మర్డర్స్.. ఒక చిన్న పట్టణంలో వరుసగా భయంకరమైన హత్యలు జరుగుతుంటాయి. ప్రతి మర్డర్ ఒక ప్రత్యేకమైన ప్యాటర్న్‌లో జరుగుతుంది. శవాల దగ్గర కొన్ని గుర్తులు వదిలి వెళ్తారు. ఇవి ఒక రకంగా మండల ఆకారాలను పోలి ఉంటాయి. ఆ హత్యలను ఓ పోలీస్ ఆఫీసర్ దర్యాప్తు చేస్తుంటాడు. ప్రతి హత్యకు లింక్ ఉంటుందని కనిపెడతాడు. ఆతర్వాత ఏం జరిగింది.? ఆ హత్యలు చేసేది ఎవరు అనేది సినిమాలోనే చూడాలి.. ఈ మూవీ నెట్ ఫ్లిక్స్ లో అందుబాటులో ఉంది. మరో సినిమా దల్దల్.. ఇది ఒక క్రైమ్ థ్రిల్లర్ డ్రామా..

సినీ వాయిస్ CINEMA

# మొన్న త్రిష.. ఇప్పుడు నయనతార..

## లేడీ సూపర్ స్టార్‌పై నోరు పారేసుకున్న అన్నాడీఎంకే ఎంపీ



తమిళనాడు రాజకీయాల్లోకి హీరోయిన్లను లాగుతున్నారు. మొన్న త్రిషపై ఓ ఎంపీ దురుసుగా నోరు జారారు. ఇప్పుడు నయనతారపై మరో ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ను విమర్శంచే క్రమంలో అనవసరంగా నయన్ పేరును తీసుకొచ్చారు ఎంపీ షణ్ముగం. లేడీ సూపర్ స్టార్, ప్రముఖ నటి నయనతారపై అనుచిత వ్యాఖ్యలు చేసి చిక్కుల్లో పడ్డారు అన్నాడీఎంకే ఎంపీ షణ్ముగం. ఎంకే స్టాలిన్ ప్రభుత్వంపై విమర్శలు చేసిన ఆయన అనవసరంగా నయన్ పేరును ప్రస్తావ-నకు తీసుకొచ్చారు. దీంతో ఎంపీపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహిళా లోకానికి ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. శాంతిభద్రతలను పరిరక్షించడం, మాదకద్రవ్యాల వ్యసనాన్ని నియంత్రించడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందంటూ అన్నాడీఎంకే కూటమి బుధవారం (మార్చి 17) రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టిది. చెన్నైలో జరిగిన ఈ నిరసనకు ఎడప్పాడి పళనిస్వామి నాయకత్వం వహించారు . గత కొన్ని నెలలుగా తమిళనాడులో మహిళలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని, విద్యార్థులలో మాదకద్రవ్యాల వ్యసనం పెరుగుతోందని ఈ సందర్భంగా అన్నాడీఎంకే నేతలు ముఖ్యమంత్రిపై ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో, విల్లుపురం జిల్లాలోని కొత్త బస్ స్టాండ్ సమీపంలో ఎంపీ షణ్ముగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశం మధ్యలోనే ఆయన మట్లాడుతూ నయనతారపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఇటీవల, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ 'మీ కలను చెప్పండి' పథకాన్ని ప్రవేశపెట్టారు. దీనిని విమర్శిస్తూ, ఆయన ఇలా అన్నారు, "అబ్దుల్ కలాం 'కలలు కనండి' అన్నారు. మన ముఖ్యమంత్రి ఒక అడుగు ముందుకు వేసి 'మీ కల చెప్పండి' పథకాన్ని ప్రారంభించారు. నాకు నయనతార కావాలని అడిగితే.. ఆయన నెరవేరుస్తారా..? ఆమెను పెళ్లి చేసుకోవాలనే కల ఎవరికైనా ఉంటే . తమిళనాడు ముఖ్యమంత్రి తీరుస్తారా' అంటూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. దీంతో ఈ మాజీ ఎంపీ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహిళా లోకానికి ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలన్న డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. కాగా తన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రావడంతో షణ్ముగం వివరణ ఇచ్చారు. శాంతిభద్రతలు, లైంగిక నేరాలు, మాదకద్రవ్యాల సమస్యలపై మాట్లాడే క్రమంలోనే ఈ తప్పు దొర్లిందన్నారు. ఉద్దేశపూర్వకంగా ఈ వ్యాఖ్యలు చేయలేదన్నారు. తన మాటలు ఎవరినైనా బాధ పెట్టి ఉంటే క్షమించాలని ఎంపీ కోరారు.

క్రీడా వాయిస్

# ఒక్కరు, ఇద్దరు కాదు భయ్యో..

## ఏకంగా 11 మంది.. ప్రత్యర్థులు పచ్చడైపోవాల్సిందే..




ఐపీఎల్ అంటేనే కొత్త ప్రతిభకు కేరాఫ్ అడ్రస్.! 2026 సీజన్‌లో స్టార్ ఆటగాళ్ల కంటే ఎక్కువగా అన్‌క్యాప్డ్ ప్లేయర్స్ హాట్ టాపిక్ అయ్యారు. కేవలం లక్షల్లో బేస్ ప్రైస్ ఉండి, ఏకంగా 14 కోట్లకు పైగా ధర పలికిన ఆణిముత్యాలు వీరు. చెన్నై సూపర్ కింగ్స్ నుంచి ఆర్సీబీ వరకు ఏ జట్టు ఎవరిని కొనుగోలు చేసింది? గ్రౌండ్‌లో సునామీ సృష్టించే ఆ డేంజరస్ ప్లేయర్స్ ఎవరో ఓసారి చూద్దాం.. ఐపీఎల్ 2026 వేలం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అన్‌క్యాప్డ్ ప్లేయర్లపై కాసుల వర్షం కురిసింది. అనుభవం లేకపోయినా, దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన కుర్రాళ్ల కోసం ఫ్రాంచైజీలు పోటాపోటీగా వేలం పాడాయి. ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు భవిష్యత్తు స్టార్లను పసిగట్టడంలో సఫలమయ్యాయి.

**జూఖ అమ్ములపొదిలో అస్త్రాలు: ప్రశాంత్ వీర్, కార్తీక్ శర్మ..**

ఈ సీజన్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన పేరు ప్రశాంత్ వీర్. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ 20 ఏళ్ల స్పిన్ ఆల్‌రౌండర్ కోసం జూఖ ఏకంగా రూ. 14.20 కోట్లు ఖర్చు చేసింది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా ఇతను రికార్డు సృష్టించాడు. అలాగే రాజస్థాన్‌కు చెందిన వికెట్ కీపర్ బ్యాటర్ కార్తీక్ శర్మ కూడా రూ.14.20 కోట్లు పలికి అందరినీ ఆశ్చర్యపరిచాడు. వీరిద్దరూ చెన్నై జట్టుకు ప్రధాన బలంగా మారనున్నారు.

**RCB బ్రహ్మాస్త్రం: మంగేష్ యాదవ్..**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మధ్యప్రదేశ్ యువ సంచలనం మంగేష్ యాదవ్ కోసం రూ. 5.20 కోట్లు వెచ్చించింది. డొమెస్టిక్ క్రికెట్‌లో అడుగుపెట్టిన కొద్ది రోజుల్లోనే ఇతను తన ఆల్‌రౌండ్ ప్రతిభతో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఆర్సీబీ మిడిల్ ఆర్డర్‌లో ఇతను కీలక పాత్ర పోషించనున్నాడు.

**ఢిల్లీ క్యాపిటల్స్‌లో 'కాశ్మీర్ ఎక్స్‌ప్రెస్'..**

బౌలింగ్ విభాగంలో జమ్మూ కాశ్మీర్ ఫాస్ట్ బౌలర్ ఆకిబ్ నబీ హాట్ కేకులా మారాడు. రంజీ ట్రోఫీలో 60 వికెట్లతో చెలరేగిన ఇతడిని ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 8.40 కోట్లకు దక్కించుకుంది. డెత్ ఓవర్లలో యార్కర్లు వేయడంలో ఇతను సిద్ధహస్తుడు.

**మరికొంత మంది కీలక ఆటగాళ్లు..**

వీరితో పాటు రాజస్థాన్ రాయల్స్ దక్కించుకున్న అండర్-19 స్టార్ వైభవ్ సూర్యవంశీ, కేకేఆర్ హిట్టర్ తేజస్వి సేయింగ్, సన్‌రైజర్స్ హైదరాబాద్ కొనుగోలు చేసిన విధ్వంకర బ్యాటర్ సలీల్ అరోరా (కోటిన్నర ధర) ఈ సీజన్‌లో మ్యాచ్ విన్నర్లుగా మారే అవకాశం ఉంది. మొత్తానికి IPL 2026 ఈ యువ కిశోరాల పోరాటంతో రసవత్తరంగా మారనుంది.

# పీఎల్ చరిత్రలోనే భారీ సిక్సర్ ఇదే..

## 18 ఏళ్లుగా బద్దలవ్వని రికార్డ్ ఎవరిదంటే..?




ఐపీఎల్ అంటే భారీ సిక్సర్లు, రికార్డుల వర్షం. ప్రతి సీజన్‌లో కొత్త రికార్డులు నమోదవుతుంటాయి. కానీ, ఒక రికార్డు మాత్రం 18 ఏళ్లుగా చెక్కుచెదరలేదు. IPL చరిత్రలోనే అత్యంత పొడవైన సిక్సర్ ఎవరు కొట్టారు? ఎంత దూరం వెళ్లింది? ఆ రికార్డు ఇప్పటికీ ఎందుకు బ్రేక్ కాలేదు? పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.. ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఎన్నో భారీ సిక్సర్లు ప్రేక్షకులను అలరించాయి. క్రిస్ గేల్, ఏబీ డివిలియర్స్, ఎంఎస్ ధోనీ, కీరన్ పొలార్డ్ వంటి దూకుడు ఆటగాళ్లు భారీ హిట్లతో పేరు తెచ్చుకున్నా.. IPL చరిత్రలోనే అతి పొడవైన సిక్సర్ మాత్రం వీరిది కాదని మీకు తెలుసా? ఆ రికార్డు సొంతం చేసుకున్నది దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ ఆల్బీ మోర్కెల్. 2008లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడుతూ ఆయన 125 మీటర్ల భారీ సిక్సర్ కొట్టాడు. ఆశ్చర్యకరంగా, ఇప్పటి వరకు 18 సీజన్లు పూర్తయినా ఆ రికార్డు ఎవ్వరూ చెరపలేకపోయారు.

**సంవత్సరాల వారీగా భారీ సిక్సర్లు..**

IPL ప్రతి సీజన్‌లో అతి పెద్ద సిక్సర్లు నమోదవుతున్నా.. అవి మోర్కెల్ రికార్డుకు చేరువ కాలేకపోతున్నాయి.

2008 - ప్రవీణ్ కుమార్ (124 మీటర్లు), 2009 - ఆడమ్ గిల్‌క్రిస్ట్ (122 మీటర్లు), 2010 - రాబిన్ ఉతప్ప (120 మీటర్లు), 2011 - ఆడమ్ గిల్‌క్రిస్ట్ (122 మీటర్లు), 2012 - ఎంఎస్ ధోనీ (112 మీటర్లు), 2013 - క్రిస్ గేల్ (119 మీటర్లు), 2014 - డేవిడ్ మిల్లర్ (102 మీటర్లు), 2015 - ఏబీ డివిలియర్స్ (111 మీటర్లు), 2016 - బెన్ కట్టింగ్ (117 మీటర్లు), 2017 - ట్రావిస్ హెడ్ (109 మీటర్లు), 2018 - ఎబి డివిలియర్స్ (111 మీటర్లు), 2019 - ఎంఎస్ ధోనీ (111 మీటర్లు), 2020 - నికోలస్ పూరన్ (106 మీటర్లు), 2021 - కీరన్ పొలార్డ్ (105 మీటర్లు), 2022 - లియామ్ లివింగ్‌స్టోన్ (117 మీటర్లు), 2023 - ఫాఫ్ డుప్లెసిస్ (115 మీటర్లు), 2024 - హెన్రిచ్ క్లాసెన్ (108 మీటర్లు)

**మోర్కెల్ రికార్డు ఎందుకు బ్రేక్ కాలేదు?**

125 మీటర్ల సిక్సర్ అంటే సాధారణ విషయం కాదు. దీనికి పవర్ మాత్రమే కాదు, టైమింగ్, పిచ్ పరిస్థితులు, బౌలింగ్ వేగం అన్నీ కలవాలి. క్రిస్ గేల్, ధోనీ, డివిలియర్స్ లాంటి దిగ్గజాలు ఉన్నా.. ఈ రికార్డుకు చేరువ కాలేకపోవడం ఆశ్చర్యమే. ఆధునిక క్రికెట్‌లో ఫిట్‌నెస్, టెక్నాలజీ పెరిగినా ఈ రికార్డు చెరగకపోవడం దీని ప్రత్యేకతను తెలియజేస్తోంది.

**IPL 2026లో రికార్డు బ్రేక్ అవుతుందా?**

ప్రస్తుతం యువ ఆటగాళ్లు భారీ హిట్లతో ఆకట్టుకుంటున్నారు. లివింగ్‌స్టోన్, క్లాసెన్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లు మంచి ఫామ్‌లో ఉన్నారు. IPL 2026లో ఈ రికార్డు బ్రేక్ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అయితే, మోర్కెల్ రికార్డు చెరిపేయాలంటే అసాధారణ ఇన్నింగ్స్ అవసరం. IPLలో ప్రతి సీజన్ కొత్త రికార్డులు తీసుకొస్తున్నా.. మోర్కెల్ 125 మీటర్ల సిక్సర్ మాత్రం ఇప్పటికీ అందని ద్రాక్షగానే ఉంది. IPL 2026లో ఎవరైనా ఈ ఘనత సాధిస్తారా లేదా అన్నది చూడాలి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైమ్ వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com